





# విజయభాను

విశాఖపట్నం, ఆదివారం 13-08-2023 VIJAYABHANU DAILY * VISAKHAPATNAM సంపుటి : 47 సంచిక : 268 పేజీలు : 08 వెల : 1 రూపాయి


## భారత్‌లో అవినీతిని సహించని వ్యవస్థ



న్యూఢిల్లీ : భారత దేశం ఎట్టి పరిస్థితుల్లోనూ అవినీతిని సహించబోదని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. అవినీతి వల్ల ప్రజల జీవన నాణ్యత క్షీణిస్తుందని తెలిపారు. అవినీతి ప్రభావం వనరుల వినియోగంపైన ఉంటుందన్నారు. మార్కెట్లను కుదిపేస్తుందని, సేవల బట్వాడాను ప్రభావితం చేస్తుందని తెలిపారు. వీటన్నిటి వల్ల భారతీయులపై వ్యతిరేక ప్రభావం పడుతుందని తెలిపారు. కోల్‌కతాలో శనివారం జరిగిన జీ20 యాంటీ కరప్షన్ సమావేశంలో ఆయన వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా మాట్లాడారు. "అవినీతి నిర్మూలన కోసం పోరాడటం మా ప్రజల పట్ల మా పవిత్ర కర్తవ్యం" అని మోదీ తెలిపారు. కౌటిల్యుని అర్థ శాస్త్రాన్ని ప్రస్తావిస్తూ, గరిష్ఠ స్థాయి ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వ నిధులను తరువాయి 2లో..

## రాష్ట్రపతి ఆమోద ముద్ర..

### చట్టరూపం సంతరించుకున్న ఢిల్లీ సర్వీసుల బిల్లు




న్యూఢిల్లీ : పార్లమెంటు ఉభయ సభల ఆమోదం పొందిన ఢిల్లీ సర్వీసుల బిల్లు కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శనివారం నాడు ఆమోదముద్ర వేశారు. దీంతో బిల్లు చట్టరూపం సంతరించుకుంది. ఈమేరకు భారత ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చింది. ఢిల్లీ ప్రభుత్వం లోని సీనియర్ అధికారుల నియామకాలు, బదిలీలకు సంబంధించిన అధికారాన్ని కేంద్రానికి కట్టబెట్టే ఢిల్లీ సర్వీసుల బిల్లును ఆగస్టు 3న మూజువాణి ఓటుతో లోక్‌సభ ఆమోదించింది. ఓటింగ్‌కు ముందే విపక్ష పార్టీలు సభ నుంచి వాకౌట్ చేశాయి. అటూ రాజ్యసభలోనూ గట్టి పోటీ ఎదురైనప్పటికీ బిల్లు గట్టెక్కింది. బిల్లుకు అనుకూలంగా 131 ఓట్లు పోలయ్యాయి. వ్యతిరేకంగా 102 ఓట్లు పడ్డాయి. 26 పార్టీల I.N.D.I.A. కూటమి నుంచి గట్టి ప్రతిఘటన ఎదురైనప్పటికీ, టీడీపీ, బీజేడీ, వైఎస్ఆర్‌సీపీ వంటి విపక్ష పార్టీలు బిల్లుకు అనుకూలంగా ఓటు వేశాయి. తొలుత బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టిన హోం మంత్రి విపక్ష నేతల చర్చ అనంతరం సమాధానమిచ్చారు. విపక్ష పార్టీలు తమ కూటమిని నిలుపుకునేందుకు ప్రాధాన్యం ఇస్తున్నాయని, ఢిల్లీ ఒక రాష్ట్రం కాదని, కేంద్రపాలిత ప్రాంతమని అన్నారు. ఢిల్లీకి సంబంధించి చట్టాలు చేసే అధికారం పార్లమెంటుకు ఉందన్నారు. తాము ఢిల్లీ కోసం ఆలోచిస్తుంటే విపక్షాలు పొత్తుల కోసం వెంపర్లాడుతున్నాయని తరువాయి 2లో..

## లా అండ్ ఆర్డర్ కు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

- పోలీసులపై దాడి చేస్తే కఠిన చర్యలు తప్పవు
- గత ఏడాదితో పోలిస్తే రాష్ట్రంలో 20 శాతం నేరాలు తగ్గుముఖం
- ఏపీ డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి



నరసాపురం(విజయభాను న్యూస్) : ఆంధ్రప్రదేశ్ లో లా అండ్ ఆర్డర్ కు విఘాతం కలిగించిన, దెబ్బతీసే విధంగా రెచ్చగొట్టే ప్రకటనలు చేసిన ఎవరినీ ఉపేక్షించేలేదని ఏపీ డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలో డీజీపీ పర్యటించారు. ఈసందర్భంగా డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ పుంగనూరులో పోలీసులపై అల్లరి మూకలు చేసిన దాడులను ఖండించారు. ఈ కేసులో ఇప్పటి వరకు సుమారు 80 మందిని అదుపులోకి తీసుకున్నామని ఆయన పేర్కొన్నారు. ఎవరైనా సరే పోలీసుల మీద దాడి చేస్తే కఠిన చర్యలు తప్పవు అని డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. అయితే పుంగనూరులో దాడికి పాల్పడింది స్థానికులా, లేక బయట నుంచి వచ్చిన వ్యక్తులా అన్నదానిపై లోతైన విచారణ చేస్తున్నామని డీజీపీ రాజేంద్రనాథ్ పేర్కొన్నారు. పోలీసు వ్యవస్థ అందరి కోసం పనిచేస్తుందని రాజకీయ పార్టీలు గుర్తించుకోని తమకు సహకరించాలి అని ఆయన తెలిపారు.

రాష్ట్ర పోలీస్ వ్యవస్థలో కొత్త ఒరవడి సృష్టించామని 1.40 లక్షల మంది మహిళలు దిశా యాప్‌లో రిజిస్టర్ అయ్యారని ఈ సందర్భంగా డీజీపీ తెలియజేశారు. ఇప్పటి వరకు 27 వేల మంది మహిళలు ఈ యాప్ ద్వారా పోలీసులకు కంప్లైంట్ చేశారు. గత ఏడాదితో పోలిస్తే రాష్ట్రంలో 20 శాతం నేరాలు తగ్గుముఖం పట్టాయని ఏపీ డీజీపీ తెలిపారు.




## సీఎంవోలో డిజిటల్ సంతకాల దుర్వినియోగం.. ఐదుగురి అరెస్టు

అమరావతి, (విజయభాను న్యూస్) : ముఖ్యమంత్రి కార్యాలయంలో డిజిటల్ సంతకాల దుర్వినియోగం కేసులో ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్లు సైబర్ క్రైమ్ సీఐడి ఎస్పీ హర్ష వర్ధన్ రాజు వెల్లడించారు. నిందితులు కొందరు కార్యదర్శుల డిజిటల్ సంతకాలను దుర్వినియోగం చేసి 'సీఎం పిటిషన్'లు జారీ చేసినట్లు తెలిపారు. సీఎంవోలోని రేవు ముత్యాల రాజు, ధనుంజయ్ రెడ్డి, సీఎస్ జవహర్ రెడ్డి పేషీల్లో పని చేస్తున్న వీరు సంతకాలను దుర్వినియోగం చేశారన్నారు. ఒక్కో ఫైల్‌కు రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకూ వసూలు చేశారన్నారు. ఏప్రిల్ నుంచి 3 నెలల్లో 66 సీఎంపీలు జారీ చేసిన నిందితులు.. మొత్తం రూ.15 లక్షల వరకూ వసూలు చేసినట్లు గుర్తించామని తెలిపారు. అయితే, ఏ దస్త్రానికి తుది ఆమోదం రాలేదని తరువాయి 2లో..

## సమాంతర వ్యవస్థ శాంతిభద్రతలకు విఘాతం

- వాలంటీర్ వ్యవస్థ కోసం ప్రభుత్వం నిబంధనలు తుంగలో తొక్కుతోంది.
- రాష్ట్రంలో శాంతిభద్రతలు విఫలమయ్యాయి
- విశాఖను నేరాలకు అడ్డాగా మార్చిన వైసీపీ
- సొంత ఇంట్లో వారిని కాపాడుకోలేని అసమర్థ ఎంపీ

జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్



వాలంటీర్ అనే ఈ సమాంతరం వ్యవస్థ ద్వారా శాంతిభద్రతలకు విఘాతం ఏర్పాడుతుంది అని జనసేన అధినేత పవన్ కళ్యాన్ ఆరోపించారు. పెందుర్తి నియోజకవర్గం సుజాతనగర్ లో ఇటీవల వాలంటీర్ చేతిలో హత్యకు గురైన కోటగిరి వరలక్ష్మి కుటుంబాన్ని పవన్ కళ్యాణ్ శనివారం పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్, పార్టీ నేతలు ఈ పరామర్శలో పాల్గొన్నారు. వార్త 3లో

## తిరుమలలో విషాదం.. చిరుత దాడిలో చిన్నారి మృతి




తిరుమల: తిరుమల కొండపై తీవ్ర విషాదం నెలకొంది. అలిపిరి కాలినడక మార్గంలో చిరుత దాడిలో ఆరేళ్ల బాలిక మృతి చెందింది. శుక్రవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో చిన్నారి లక్షిత సహా కుటుంబ సభ్యులు కాలినడకన శ్రీవారి దర్శనానికి బయలుదేరారు. రాత్రి 11 గంటలకు లక్ష్మీనరసింహస్వామి గుడి వద్దకు చేరుకున్నారు. ఇంకో గంట సమయం ప్రయాణిస్తే తిరుమలకు చేరుకుంటారనగా.. ముందు వెళ్తున్న చిన్నారిపై ఒక్కసారిగా చిరుత దాడి చేసింది. కుటుంబసభ్యులు భయంతో కేకలు వేయడంతో అడవిలోకి ఈడ్చుకెళ్లింది. దీంతో పోలీసులకు బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. అయితే, రాత్రి సమయం కావడంతో గాలింపు చర్యలు చేసేందుకు తరువాయి 2లో..

## అలిపిరి నడక మార్గంలో పటిష్ట బందోబస్తు

### టీటీడీ ఈవో ధర్మారెడ్డి



తిరుమల: తిరుమలలో అలిపిరి నడక మార్గంలో చిరుత దాడిలో మృతిచెందిన బాలిక ఘటనపై టీటీడీ అప్రమత్తమైంది. ఈ క్రమంలో టీటీడీ ఈవో ధర్మారెడ్డి శనివారం అత్యవసర సమావేవేశాన్ని ఏర్పాటు చేశారు. అటవీశాఖ, విజిలెన్స్ అధికారులతో సమావేశమయ్యారు. తిరుమల నడకమార్గంలో భక్తుల భద్రతకు తీసుకోవాల్సిన తరువాయి 2లో..



## ఎన్టీఆర్ చిత్రంతో రూ.100 నాణెం..

### ఆగస్టు 28న ఆవిష్కరించనున్న రాష్ట్రపతి

విజయవాడ: నందమూరి తారకరామారావు శత జయంతిని పురస్కరించుకొని ఆయన గౌరవార్థం కేంద్ర ప్రభుత్వం ఎన్టీఆర్ చిత్రంతో రూ.100 నాణెం ముద్రించాలని నిర్ణయించినట్టు భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి తెలిపారు. ఈ నిర్ణయంలో భాగంగా కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ హైదరాబాద్‌లోని మింట్‌కు ఆదేశాలు ఇచ్చిందన్నారు. ఎన్టీఆర్ బొమ్మతో వంద రూపాయల నాణెం ముద్రించి సిద్ధం చేశారని, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఆవిష్కరిస్తారని తెలిపారు. ఈనెల 28న ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగే ఈ కార్యక్రమానికి ఎన్టీఆర్ కుటుంబ సభ్యులతో పాటు వందమందిని ఆహ్వానించారని పురంధేశ్వరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 50 శాతం వెండి, 40 శాతం రాగి, 5 శాతం నికెల్, 5 శాతం జింకుతో నాణెం తయారీ ఉండాలని కేంద్రం నిర్ణయించిన విషయం తెలిసిందే.



# అనాధ మృతదేహానికి అంత్యక్రియలు



కాకినాడ, ఆగస్టు 12: గుర్తు తెలియని చనిపోయి ఉన్న 60 ఏళ్ల వ్యక్తికి అంబులెన్స్ డ్రైవర్ కేబి అంబేద్కర్ అంత్యక్రియలు నిర్వహించారు. కాకినాడలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా బ్రిడ్జి కింద చనిపోయి ఉన్న ఈ మృతదేహాన్ని చూసి అంబేద్కర్ అతనిని తన అంబులెన్స్లో తీసుకువెళ్లి స్థానిక విజ్జపు రెడ్డి వారి హిందూ స్మశాన వాటికలో శనివారం అంతిమ సంస్కారాలు నిర్వహించారు. గుర్తుతెలియని వ్యక్తి చనిపోయి ఉన్న సమాచారం టూ టౌన్ పోలీస్ స్టేషన్ తెలియడంతో అక్కడికి కానిస్టేబుల్ వి మూర్తి, జి కాంత్లు హాజరై అంబేద్కర్ సమక్షంలో మృతదేహాన్ని తరలించారు.

ఈ సందర్భంగా అంబేద్కర్ మాట్లాడుతూ తాను సుమారు 12 ఏళ్ల కాలం నుంచి గుర్తు తెలియని మృతదేహాలను తీసుకువెళ్లి అంత్యక్రియలు నిర్వహిస్తున్నానని చెప్పారు. అలాగే కాకినాడలో అనాధ మృతదేహాలను తీసుకెళ్లేందుకు ప్రభుత్వం ఒక అంబులెన్స్ ఇస్తే తాను ఉచితంగా సేవ చేస్తానని అంబులెన్స్ డ్రైవర్ కేబి అంబేద్కర్ చెప్పారు.

# డివైడర్ ను ఢీకొని వ్యక్తి మృతి



భీమునిపట్నం : విజయభాను న్యూస్ తగరపువలస,చిట్టివలస కు చెందిన డింగి పైడిరాజు(33) భీమిలి నోవాటెల్ హోటల్ లో పెయింటర్ గా పనిచేస్తున్నారు. అయితే శుక్రవారం ఉదయం 11 గంటలకు జిల్లా పరిషత్ దగ్గర ఫంక్షన్ కు బైక్ పై వెళ్ళారు . అయితే రాత్రి 8.30 అయిన ఇంటికి రాకపోవడంతో పైడిరాజు భార్య కనక రత్నం ఫోన్ చేసిన కూడా లిఫ్ట్ చేయలేదు. మరల శనివారం ఉదయం 8 గంటలకు ఫోన్ చేసినప్పుడు నూకరాజు అనే వ్యక్తి ఫోన్ లిఫ్ట్ చేసి ఫోన్ గల వ్యక్తి భీమిలి జిల్లా పరిషత్, పోలమాంబ గుడి దగ్గర కల్వర్టు లో పడిపోయినట్లు తెలిపారు. దాంతో కనక రత్నం తన కుటుంబ సభ్యులుతో కలిపి సంఘటనస్థలానికి చేరుకుంది. మృతదేహం ను భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డింగి పైడిరాజు భార్య,డింగి కనక రత్నం ఫిర్యాదుమేరకు భీమిలి ఎస్.ఐ భరత్ కుమార్ రాజు కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నారు.

# అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారం



భీమునిపట్నం : విజయభాను న్యూస్ భీమిలి,ఆనందపురం,పద్మనాభం మండలాలలో ( 2022-23) 10 వ తరగతి పరీక్షాఫలితాలు లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులుకు నగదు పురస్కారం జ్ఞాపికలు అందజేసినట్లు సన్ స్కూల్ కరస్పాండెంట్ కైతపిల్లి శ్రీనివాస్ తెలిపారు. స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆయన భీమిలి నియోజకవర్గపరిధిలో మూడు మండలాలు భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాలలో ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిది పాఠశాలల నుంచి పదవతరగతి పరీక్షా ఫలితాలు సాధించిన 14 మంది విద్యార్థులుకు తాను నగదు పురస్కారాన్ని,జ్ఞాపికలను భీమిలి ఎంఈఓ శివరాణి చేతుల మీదుగా అందజేసినట్లు చెప్పారు. వీరిలో ఇద్దరు విద్యార్థులుకురూ. 5 వేలు చొప్పున, మిగతా 12 మంది విద్యార్థులుకు రూ. 3 వేలు అందజేసినట్లు తెలిపారు. ఈ సంధర్భంగా కైతపిల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివి ఎంతో కష్టపడి చదివి అత్యధిక మార్కులు సంపాదించడం పట్ల చాలా ఆనందంగా ఉందనీ తెలిపారు. ఇకపై కూడా కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించి మీ తల్లితండ్రులుకు, ఉపాధ్యాయులుకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకుని రావాలనీ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సన్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు అరుణ్,ఉపాధ్యాయులు తదితరులుపాల్గొన్నారు.

# బీచ్ రోడ్ లో చంద్రబాబు నాయుడు పాదయాత్రను విజయవంతం చేయాలి



గాజువాక ( విజయభాను న్యూస్) : ఆగష్టు 15వ తేదీన భారతదేశ స్వతంత్ర దినోత్సవం పురస్కరించుకొని జాతీయ సమైక్య భావాన్ని పెంపొందించాలని లక్ష్యంతో విజన్ డాక్యుమెంటరీ 2047 రూపకల్పన లో భాగంగా విశాఖ బీచ్ లో 2కి మీ నారా చంద్రబాబునాయుడు పాదయాత్రలో కులాలకు మతాలకు పార్టీలకతంగా అందరూ పాల్గొని విజయవంతం చేయాలని విశాఖ పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గాజువాక మాజీ శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శనివారం గాజువాక నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్విట్ ఇండియా స్ఫూర్తితో క్విట్ జగన్ పేరుతో వైకాపాను ఈ రాష్ట్రం నుండి తరిమికొట్టాలని కోరారు. 15వ తేదీన 3 గంటలకు జరిగే బీచ్ వాక్ లో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో గాజువాక నియోజకవర్గ సమన్వకర్త ప్రసాదుల శ్రీనివాస్, నాయకులు పుచ్చ విజయకుమార్, జీవీఎంసీ కార్పొరేటర్లు గంధం శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు, జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు ఎస్ అనంతలక్ష్మి ,తమ్మిన విజయకుమార్, వార్డ్ అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# బధిరిల పాఠశాలలో దుప్పట్లు పంపిణీ



రాజాం (విజయభాను న్యూస్) : పట్టణంలో సారధి రోడ్డులో బధిరిల పాఠశాలలోని దివ్యాంగ విద్యార్థులకు శనివారం దుప్పట్లు, పండ్లు, రొట్టెలు పంపిణీచేశారు. తెర్లాం మండలం బూరిపేట గ్రామానికి చెందిన దళయ దివ్య వర్ధంతి సందర్భంగా వీటిని పంపిణీచేసినట్లు కుటుంబీకులు వెల్లడించారు. ఈకార్యక్రమంలో బూరిపేట సర్పంచ్ బి. మధుసూధనరావు, డి. గణేష్, మొగిలివలస గ్రామానికి చెందిన మజ్జి హరనాధరావు తదితరులు పాల్గొన్నారు.

# గడిముడిదాంలో నా భూమి - నాదేశం



రాజాం (విజయభాను న్యూస్) : మండలంలో గడిముడిదాం గ్రామంలో నా భూమి - నాదేశం కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సచివాలయం వద్ద శిలాఫలకాన్ని ఎంపీపీ సులోచన చేతులుమీదుగా ఆవిష్కరించారు. మొక్కలు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈకార్యక్రమంలో వైఎస్ఆర్సీపీ రాజాం రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాల నాయుడు, ఎంపీడీఓ బాసూరీ శంకరరావు, ఏపీఓ సాయిరాం, పంచాయతీ సర్పంచ్ లావేటి రమాదేవి, పంచా యతీ కార్యదర్శి ఎస్ కే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# రాజాంలో క్రైస్తవ, ముస్లింల ఐక్య నిరసన శాంతి ర్యాలీ



రాజాం (విజయభాను న్యూస్) : పట్టణంలో శనివారం క్రైస్తవులు, ముస్లింలు ఐక్య నిరసన శాంతి ర్యాలీ నిర్వహించారు. మణిపూర్, హర్యానా , గుజరాత్ రాష్ట్రాలలో మైనారిటీ పై జరుగుతున్న మారణ కాండను అల్లార్లను అరికట్టాలని కోరుతూ నినాదాలు చేశారు. ప్రధాన రహదారిపై ర్యాలీ చేసి అంబేద్కర్ జంక్షన్ వద్ద మానవహారం నిర్వహించారు.

# ఘనంగా దేవాంగ సోదరుల ఆత్మీయ కలయిక



రాజాం(విజయభాను న్యూస్) : రాష్ట్ర దేవాంగ పెద్దలు నిమ్మల కిష్టప్ప ఆధ్వర్యంలో మాజీ పార్లమెంటు సభ్యులు బీరక ప్రసాద్, రాష్ట్ర దేవాంగ సంఘం ప్రతినిధి ఉప్పు సత్యనారాయణల అధ్యక్షతన రాజాం పట్టణ, పరిసర ప్రాంతాల దేవాంగ సోదరుల ఆత్మీయ కలయిక .జరిగింది. శనివారం శ్రీ సూర్య దుర్గ కళ్యాణ మండపంలో ఈకార్యక్రమం నిర్వహించి, పలు అంశాలు చర్చించారు. ఈ కార్యక్రమంలో రాజాం దేవాంగ సంఘం అధ్యక్షులు దాసరి అప్పారావు, దేవాంగ కుటుంబాలు పాల్గొన్నాయి.

## సీఎంవోలో డిజిటల్ సంతకాల దుర్వినియోగం.. ఐదుగురి అరెస్టు

వెల్లడించారు. "డాక్టర్లు, టీచర్ల బదిలీకి సంబంధించిన దస్త్రాలను సీఎంపీలు జారీ చేశారు. సీఎం పేషీలోని కార్యదర్శి భరత్ గుప్తా మొదట ఈ డిజిటల్ సంతకాల టాంపరింగ్ చేసినట్టు గుర్తించి ఫిర్యాదు చేశారు. సీఎంవో ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య డిజిటల్ సంతకం దొంగిలించి సీఎంపీలు జారీ చేశారు. ఈ వ్యవహారంపై తదుపరి విచారణ చేస్తున్నాం" అని ఎస్పీ హర్ష వర్ధన్ రాజు వెల్లడించారు.

# తిరుమలలో విషాదం.. చిరుత దాడిలో చిన్నారి మృతి

వీలు పడలేదు. ఇవాళ ఉదయం గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు.. లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి కొద్దిదూరంలో బాలిక మృతదేహాన్ని గుర్తించారు. తొలుత ఎలుగు బంటి దాడిలోనే బాలిక మృతి చెందినట్లు అటవీశాఖ అధికారులు అనుమానం వ్యక్తం చేశారు. అయితే, చిరుత దాడిలోనే చిన్నారి మృతి చెందినట్లు పోస్టుమార్టం రిపోర్టులో తిరుపతి రుయా ఆస్పత్రి వైద్యులు నిర్ధరించారు. అనంతరం బాలిక మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతదేహాన్ని బాధితుల స్వస్థలం నెల్లూరు జిల్లాలోని పోతిరెడ్డిపాలేనికి తరలించేందుకు పోలీసులు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా, గతంలోనూ కాలినడక మార్గంలో బాలుడిపై చిరుత దాడి చేసిన సంగతి తెలిసిందే.

# రాష్ట్రపతి ఆమోద ముద్ర..

అన్నారు. దీనిపై కాంగ్రెస్ విపక్ష నేత అధీర్ రంజన్ చౌదరి స్పందిస్తూ, బిల్లు ప్రవేశపెట్టాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ఇప్పుడు ఢిల్లీ, ఆ తర్వాత ఇతర రాష్ట్రాలకు ఇదే గతి పట్టవచ్చ న్నారు. ఢిల్లీలోనే కుంభకోణాలు జరిగాయ నుకుంటే, అందుకోసం బిల్లు తేవాల్సిన అవసరం ఉందా అని నిలదీశారు. ఈడీ, సీబీఐ వంటి సంస్థలు మీ చేతుల్లోనే ఉన్నందున వాటిని ఎందుకు ఉపయోగించుకోకూడదని ప్రశ్నించారు. ఆర్డినెన్స్ దారి పట్టి, హడావిడిగా బిల్లును తీసుకురావాల్సిన అవసరం ఏమందని అడిగారు. బిల్లునే నేరుగా తీసుకు రావచ్చు కదా అని ప్రశ్నించారు. అంత అసాధారణ పరిస్థితి ఏమొచ్చిందో సభకు చెప్పాలని అమిత్‌షాను కోరారు.

రాజ్యసభలోనూ 'షా' వాదన..

కేంద్ర ప్రభుత్వ అధికారుల్లో ఢిల్లీ ప్రభుత్వం చొరబడకుండా ఈ బిల్లు అడ్డుకుంటుందని అమిత్‌షా రాజ్యసభలో వాదన వినిపించారు. ఎక్సైజ్ స్కామ్‌కు సంబంధించిన ఫైళ్లు అక్కడ ఉన్నందునే విజిలెన్స్ శాఖ అధికారులను వాళ్లు (ఆప్ ప్రభుత్వం) బదిలీ చేశారని ఆరోపించారు.

# అలిపిరి నడక మార్గంలో పటిష్ట బందోబస్తు

చర్యలపై నిర్ణయం తీసుకోనున్నారు. మరోవైపు చిరుత దాడి విషయం తెలిసి హైదరాబాద్ నుంచి హుటాహుటిన తిరుమలకు బయలుదేరారు టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి.

చిన్నారిపై దాడి బాధాకరం: ఈవో

తిరుమల నడకదారిలో చిన్నారిపై దాడి బాధాకరమని టీటీడీ ఈవో ధర్మారెడ్డి అన్నారు. అలిపిరిలో చిరుతను బంధించేందుకు బోను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అలిపిరి నడకమార్గం సాయంత్రం 6 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు మూసివేతపై ఆలోచిస్తున్నట్లు పేర్కొన్నారు. నడక దారిలో ప్రతి 40 అడగులకు సెక్యూరిటీ ఉండే చర్యలు తీసుకుంటామని చెప్పారు. తిరుమలకు చిన్న పిల్లలతో వచ్చే వారు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

పటిష్ట బందోబస్తు ఏర్పాటు

నడక దారిలో ఫారెస్ట్, పోలీస్, టీటీడీ కలిసి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామని ధర్మారెడ్డి అన్నారు. అలిపిరి నడక మార్గంలో 500 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. చిరుత దాటి ఘటనపై సీసీఎఫ్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేయించాని తెలిపారు. ఘాట్ రోడ్డులో సాయంత్రం 6 గంటలకు బైక్స్ నిలిపి వేయాలని సూచనలు వచ్చాయని.. పరిశీలించి నిర్ణయం తీసుకుంటాని పేర్కొన్నారు.

దాడి చేసింది చిరుతనా లేదా ఎలుగబంటినా?

బాలికపై చిరుత దాడికి పాల్పడిన ఘటనా స్థలాన్ని సీసీఎఫ్ నాగేశ్వర రావు, డీఎఫ్ఓ సతీష్ కుమార్ పరిశీలించారు. దాడి చేసింది చిరుతా లేక ఎలు బంటా అన్నది పోస్టుమార్టం రిపోర్టు వస్తే నిర్ధారణ అవుతుందని తెలిపారు. దాడి చేసిన జంతువును బంధించేందుకు బేస్ క్యాంప్‌ను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఎలుగుబంటి అయితే మత్తు ద్వారా బంధిస్తామని, చిరుత అయితే బోన్ ద్వారా బంధిస్తామని చెప్పారు. జంతువుల కదలికలను గుర్తించేందుకు ట్రాప్ కెమెరాలతో పాటు డ్రోన్ కెమెరాలు వినియోగిస్తామని తెలిపారు. 7వ మైలు రాయి నుంచి నరసింహస్వామి ఆలయం వరకు హై అలర్ట్ జోన్‌గా ప్రకటిస్తున్నామని అన్నారు. కాగా తిరుమలలోని అలిపిరి కాలి బాటలో ఆరేళ్ల చిన్నారిపై చిరుత దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నెల్లూరు జిల్లా కోవూరు మండలం పోతిరెడ్డిపాలెం చెందిన దినేష్ కుమార్, శశికళ కుమార్తె లక్షిత శుక్రవారం సాయంత్రం అలిపిరి కాలిబాటలో కనిపించకుండా పోయింది. చిరుత దాడిని గుర్తించని తల్లిదండ్రులు.. నడకదారిలో చిన్నారి కోసం వెతగ్గా దొరకలేదు. నిన్న రాత్రి పోలీసులకు లక్షిత తప్పిపోయిందని తల్లిదండ్రులు ఫిర్యాదు చేయగా.. రాత్రి నుంచి పోలీసులు గాలింపు చర్యలు చే పట్టారు. శనివారం ఉదయం నడక దారిలో లక్షిత మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. చిన్నారి మృతదేహాన్ని తిరుపతి రుయా ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించి..ఈ ఘటనపైకేసు నమోదు చేసుకొని విచారిస్తున్నారు. లక్షిత మృతదేహానికి పోస్టుమార్టం పూర్తవ్వగా.. మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు.

# భారత్‌లో అవినీతిని సహించని వ్యవస్థ

పెంచడం ప్రభుత్వ కర్తవ్యమని చెప్పారు. సత్యం, చిత్తశుద్ధిలను దురాశ క్రమంగా క్షీణింపజేస్తుందని, ప్రతి ఒక్కరూ ఈ విషయం పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. మరింత పారదర్శక, జవాబుదారీతనంతో కూడిన వ్యవస్థను సృష్టించేందుకు టెక్నాలజీ, ఈ-గవర్నెన్స్ వ్యవస్థలను వృద్ధి చేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రాజెక్టుల్లో లీకేజీలు, గ్యాప్‌లను అరికడుతున్నామని చెప్పారు. లక్షలాది మంది ప్రజలు ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా లబ్ధి పొందుతున్నారన్నారు. ఈ విధానంలో లబ్ధిదారులకు వారి బ్యాంకు ఖాతాలకు నేరుగా సొమ్ము జమ అవుతోందన్నారు. ప్రభుత్వం ఆయుధాలు, ఇతర యంత్రాలను కొనేటపుడు అవినీతి లేకుండా, జవాబుదారీతనం ఉండేలా ప్రభుత్వ ఈ-మార్కెట్‌ప్లేస్ పోర్టల్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పోర్టల్ చాలా పారదర్శకతను తీసుకొచ్చిందన్నారు. ఆర్థిక నేరగాళ్ల చట్టాన్ని 2018లో తీసుకొచ్చామని, ఆ తర్వాత ఆర్థిక నేరగాళ్లు, పరారైన వ్యక్తుల నుంచి 1.8 బిలియన్ డాలర్లకుపైగా రాబట్టినట్లు చెప్పారు. మనీలాండరింగ్ నిరోధక చట్టం ప్రకారం 2014 నుంచి ఆర్థిక నేరగాళ్లకు సంబంధించిన 12 బిలియన్ డాలర్లకుపైగా విలువైన ఆస్తులను జప్తు చేసినట్లు తెలిపారు. జీ20 యాంటీ కరప్షన్ వర్కింగ్ గ్రూప్ సమావేశాలు కోల్‌కతాలో ఈ నెల 9న ప్రారంభమయ్యాయి. ఈ సమావేశాలు శనివారం ముగిశాయి. ఈ సమావేశాల్లో జీ20 దేశాల మంత్రులు పాల్గొన్నారు.

### కోవిడ్ -19 తరువాత పెరిగిన
# న్యూట్రాస్యూటికల్ వినియోగం



సాగర్‌నగర్ **(విజయభాను న్యూస్)** : మూలికలు మరియు పోషకాలతో రూపొందించబడిన న్యూట్రాస్యూటికల్స్ రోగనిరోధక శక్తిని మరియు సంపూర్ణ నివారణలకు ప్రసిద్ధి చెందాయని ముఖ్యంగా కోవిడ్–19 తరువాత వీటిపై ప్రజలలో అవగాహన, వినియోగం పెరిగిందని బొటానిక్ హెల్త్ కేర్ సంస్థ వ్యవస్థాపకుడు గౌరవ్ సోనీ వెల్లడించారు. తమ సంస్థ పరిశోధనా విభాగం డైరక్టర్ డాక్టర్ హెచ్.ఎన్.శివప్రసాద్ తో కలిసి శనివారం తేది.12.08.2023న గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం సందర్శించిన ఆయన స్కూల్ ఆఫ్ ఫార్మశీ లో విద్యార్థులను, పరిశోధకులను, అధ్యాపకులను ఉద్దేశించి న్యూట్రాస్యూటికల్స్ లో భారతీయ ఔషధ మొక్కల ప్రాధాన్యతపై ప్రసంగించారు. భారత దేశ ఔషధ విజ్ఞానం ఆధారంగా వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన మందుమొక్కలు, సుగంధ ద్రవ్యాల నుంచి శాస్త్రీయంగా ఔషధమూలకాలను వేరుచేసే విధానం, అందుకు ఉపయోగిస్తున్న సాంకేతికపరిజ్ఞానాన్ని వారు వివరించారు.అశ్వగంధ, పుసుపు, బకోపా వంటి ఔషధ లక్షణాలు గల భారతీయ మొక్కలను వారుఉదహరించారు. మానవాళి శ్రేయస్సు కోసం దేశీయ మందు మొక్కలపై విద్యాలయాలలో పరిశోధనలు జరపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి స్కూల్ ఆఫ్ ఫార్మశీ అసోసియేట్ ప్రొఫెసర్ కె.సునీత సంధానకర్తగా వ్యవహరించారు.

# ఇంటింటికీ త్రివర్ణ పతాకాలు పంపిణీ

-ప్రతి ఇంటిపైనా జాతీయ జెండా రెప రెప లాడాలి

– బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు




గాజువాక (విజయభాను న్యూస్) : ప్రతి ఇంటా జాతీయ భావనను ప్రదర్శించాలని గాజువాక బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు.హర్ ఘర్ తిరంగా పేరిట ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలన్న ప్రధాని నరేంద్ర మోదీ సూచన మేరకు,రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి పిలుపుతో శనివారం గాజువాకలో ఇంటింటికి త్రివర్ణ పతాకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పాత కర్నవానిపాలెం పార్టీ కార్యాలయం వద్ద తొలుత ఈ కార్యక్రమాన్ని నరసింగరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత అభిప్రాయాలు,కుల, మత,ప్రాంత అభిప్రాయ భేదాలకన్నా జాతీయ భావనే అత్యుత్తమమని స్పష్టంచేశారు. ప్రతి ఒక్కరూ నా దేశం అని భావించినప్పుడే దేశ ప్రగతి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అందరూ బాధ్యతాయుతంగా నడుచుకున్నప్పుడే స్వాతంత్ర్య సమరయోధుల ఆకాంక్షలను చేరుకోగలమన్నారు. ఈ కార్యక్రమంలో గూటూరు శంకరరావు,పి నాగేశ్వరరావు,కోసూరు తాతారావు,పేర్ల అప్పారావు,రంజిత్,రాజశేఖర్,రామస్వామి,లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరిలోవలో ఫిష్ మార్కెట్ యార్డ్ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్

- కృషి చేసిన వైకాపా నగర అధ్యక్షుడు కోలా గురువులుకు అభినందనల వెల్లువ



ఆరిలోవ (విజయభాను న్యూస్): ఆరిలోవ ప్రాంతంలో దీర్ఘకాలికంగా ఉన్న ఫిష్ మార్కెట్ యార్డ్ నిర్మానాణ సమస్యకు పుల్ స్టాప్ పడింది. మత్స్యకార కార్పొరేషన్ మాజీ చైర్మన్, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు చొరవతో నిర్మాణం చేపట్టేందుకు సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఫిష్ మార్కెట్ యార్డ్ నిర్మాణానికి పది లక్షల రూపాయలను ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో ఆరిలోవ ప్రాంతంలో 10 లక్షల వ్యయంతో సుమారు 40 షాపులు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. తమ దీర్ఘకాలిక సమస్యను పరిష్కరించడంలో కోలా గురువులు చేసిన కృషికి అభినందనలతో ముంచెత్తారు. స్థానిక మత్స్యకారులు, మత్స్యకార సంఘ నాయకులు మద్దిలపాలెం పార్టీ కార్యాలయ%శీ%లో శనివారం కలిసి అభినందించి కృతజ్ఞతలు తెలియజేశారు. గురువులు ను అభినందించిన వారిలో సిటీ మత్స్యకార సంఘం అధ్యక్షులు కొక్కిలి గెడ్డ రాజా వర్మ, శాంతి నగర్ మత్స్యకార నాయకులు వాసుపల్లి అప్పన్న, గాంధీనగర్ మత్స్యకార నాయకులు రాగతి అచ్యుతరావు, నేషనల్ ఫిషరీస్ వర్కర్స్ ఫెడరేషన్ కౌన్సిల్ సభ్యులు కొక్కిలిగెడ్డ వెంకటేశ్వరరావు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ

గురువులు చొరవతో గత 15 ఏళ్లుగా పరిష్కారం కానీ ఆరిలోవ ప్రాంత ఫిష్ మార్కెట్ యార్డ్ నిర్మాణ సమస్య పరిష్కార దశకు రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

# సమాంతర వ్యవస్థ శాంతిభద్రతలకు విఘాతం

- వాలంటీర్ వ్యవస్థ కోసం ప్రభుత్వం నిబంధనలు తుంగలో తొక్కుతోంది.
- రాష్ట్రంలో శాంతిభద్రతలు విఫలమయ్యాయి
- విశాఖను నేరాలకు అడ్డాగా మార్చిన వైసీపీ
- సొంత ఇంట్లో వారిని కాపాడుకోలేని అసమర్థ ఎంపీ

జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్



పెందుర్తి, ( విజయభాను న్యూస్) : వాలంటీర్ అనే ఈ సమాంతరం వ్యవస్థ ద్వారా శాంతిభద్రతలకు విఘాతం ఏర్పాడుతుంది అని జనసేన అధినేత పవన్ కళ్యాన్ అరోపించారు. పెందుర్తి నియోజకవర్గం సుజాతనగర్ లో ఇటీవల వాలంటీర్ చేతిలో హత్యకు గురైన కోటగిరి వరలక్ష్మి కుటుంబాన్ని పవన్ కళ్యాణ్ శనివారం పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్, పార్టీ నేతలు ఈ పరామర్శలో పాల్గొన్నారు. అనంతరం పవన్ కళ్యాణ్ విలేకరులు సమావేశంలో మాట్లాడుతూ "వైసీపీ ప్రభుత్వం తమ నవరత్నాల కోసం నియమించిన వాలంటీర్ వ్యవస్థ ఈ రోజు ప్రజల ప్రాణాలు తీస్తోందని కొంతమంది వాలంటీర్లు అసాంఘిక శక్తులుగా మారి నేరాలకు తెగబడు తున్నారన్నారు. వాళ్లు చేస్తున్న దురాగతాలు కొన్ని మాత్రమే బయటకు వస్తున్నాయి. బయటకు రాని నేరాలు చాలానే ఉన్నాయి. పాస్ పోర్టు కావాలన్నా, చిన్నపాటి ఉద్యోగానికైనా పోలీస్ వెరిఫికేషన్ చేస్తారు.

ఉద్యోగాలు ఇస్తున్నప్పుడు ఎందుకు పోలీస్ వెరిఫికేషన్ చేయడం లేదు వైసీపీ తన కోసం వినియోగించుకునే వ్యవస్థను నిబంధనలు గాలికొదిలి తయారు చేస్తోందని విమర్శించారు. 'బంగారు ఆభరణాల కోసం ఒంటరి వృద్ధురాలిని వాలంటీర్ అతి కిరాతకంగా హత్య చేసిన ఘటన గురించి తెలుసుకొంటే బాధ ఆగలేదు. ముఖంపై పిడిగుద్దులు గుద్ది, పీకనులిమి అత్యంత భయానకంగా హత్య చేశాడు. ఆమె నివసిస్తున్న ప్రాంతానికి దగ్గరలోనే ఉన్నా మా అమ్మను కాపాడుకోలేకపోయామని వృద్ధురాలి కొడుకు పడుతున్న ఆవేదన చూసి కడుపు తబుక్కుపోతోందన్నారు. హత్య జరిగి పది రోజులు కావొస్తున్న ఇప్పటి వరకూ ప్రభుత్వం నుంచి ఒక్క నాయకుడు కూడా పరామర్శకు రాలేదు అంటే వాళ్ల ఆలోచన విధానం ఏంటో అర్థమవుతుంద'ని జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ అన్నారు.

### వ్యవస్థలను సక్రమంగా పని చేయిస్తే నేరాలు జరగవు

రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా విఫలం అయ్యాయి. వైసీపీ అధికారంలోకి వచ్చాకా దాదాపు 30వేల మంది మహిళలు అదృశ్యమైపోయారు అని నేను మాట్లాడితే నా మీద వైసీపీ నాయకులు విరుచుకుపడ్డారు. పార్లమెంట్ సాక్షిగా నేను చెప్పింది నిజమని తేలింది. ఉత్తరాంధ్ర నుంచి 155 మంది చిన్న పిల్లలు అదృశ్యమైపోయారు. ఇది నేను చెబుతున్నది కాదు నోబుల్ అవార్డు గ్రహీత కైలాస్ సత్యర్థి చెప్పారు. అసలు చిన్నారుల అక్రమ రవాణాకు మూలం ఏమిటో, మాయం అవుతున్న చిన్నారులు ఏమవుతున్నారో కూడా వైసీపీ ప్రభుత్వానికి పట్టడం లేదు. చిన్న బిడ్డలు ఉన్న వారు పిల్లలను జాగ్రత్తగా కాపాడుకోండి. విశాఖ ప్రశాంతమైన నగరం. క్రైమ్ రేటు చాలా తక్కువగా ఉండేది. అలాంటి ప్రాంతంలోనే నేడు హ్యూమన్ ట్రాఫికింగ్ ఎక్కువగా ఉంది. బయటకు రావొద్దు, అభివాదం చేయొద్దు అని నాకు ఆంక్షలు విధిస్తారు. వాలంటీర్లకు మాత్రం ఎలాంటి ఆంక్షలు ఉండవు. పోలీసులు వారి పని వారు చేస్తే సమాజంలో నేరాలు ఉండవు... కానీ మంత్రులు, ఎమ్మెల్యేలు రాష్ట్ర పోలీస్ వ్యవస్థ చేతులు కట్టేస్తున్నారు. వారు చెప్పినట్లుగా పోలీసులు వినాల్సిన పరిస్థితులు ఉన్నాయి. దీంతో అసాంఘిక శక్తులు పెట్రేగిపోతున్నాయి. వ్యవస్థలను సక్రమంగా పని చేయనిస్తే నేరాలే జరగవు. వ్యవస్థలను బలోపేతం చేసి, శాంతిభద్రతలను కాపాడుకోవడమే జనసేన లక్ష్యం. చిన్న పిల్లలు, ఒంటరి మహిళలు, వృద్ధులు ఉన్న చోట చుట్టు పక్కల వాళ్లు ఆ ఇంటికి ఎవరెవరూ వస్తున్నారో అన్న దానిపై కన్నేసి ఉంచండి. అనుమానస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వండి. స్టేషన్ కు వెళ్లలేకపోతే సోషల్ మీడియాలో అయినా వివరాలు పోస్టు చేయండి. అన్ని పార్టీలు కూడా రాష్ట్రంలోని శాంత్రి భద్రతల సమస్యపై స్పందించాల్సిన అవసరం ఉంది. ప్రజలకు రక్షణ లేకుంటే ఉమ్మడిగా రాజకీయాలకు అతీతంగా కలిసికట్టుగా పాలకపక్షంపై పోరాడాల్సిన సమయం ఇది.

### వైసీపీ నాయకులు రౌడీలతో మిలాఖత్ అయిపోయారు

విశాఖలో లా అండ్ అర్డర్ ఎంతలా దిగజారిపోయిందంటే ఎంపీ కుటుంబానికే రక్షణ లేకుండా పోయింది. డబ్బు కోసం ఎంపీ కొడుకు, భార్యను కిడ్నాప్ చేసిన రౌడీలనే ఎంపీ వెనకేసుకొస్తారు. ఇంట్లో సొంత మహిళలపై దాడి చేసే వారిని వెనకేసుకొచ్చే నువ్వేమి ఎంపీవి? వైసీపీ నాయకులు, రౌడీలు మిలాఖత్ అయిపోయారు. దుర్మార్గులు, దుష్టులతో స్నేహం చేసి పోషిస్తే కచ్చితంగా ఏదో రోజు మీ ఇంటి ఆడవాళ్ల మీదకు వస్తారు. కొడుకును, భార్యను కిడ్నాప్ చేసిన రౌడీలకు ఎంపీ భయపడుతున్నారు. వారికి వత్తాసు పలుకుతున్నాడంటే ఎంపీ ఎంతటి అసమర్థుడో అర్థం చేసుకోవచ్చు.

డబ్బులతో ఓట్లు కొనుగోలు చేసి, అధికారంలోకి వస్తే ధైర్యం ఎక్కడ నుంచి వస్తుంది. ఓట్లు వేసే ముందు ప్రజలు ఒక్క సారి ఆలోచించాలి. ఒక ఎంపీ కుటుంబం మీదే దాడి జరిగితేనే దిక్కు మొక్కు లేదు. ఇక మన పరిస్థితి ఎలా ఉంటుందో ఆలోచించుకోవాలి. ఆంధ్రప్రదేశ్ లో ఉన్న లా అండ్ అర్డర్ పరిస్థితులను కేంద్రం దృష్టికి తీసుకెళ్తాం. నానాటికీ దిగజారిపోతున్న ఆంధ్ర పరిస్థితిని తప్పకుండా కేంద్రానిక తెలియజేస్తాం. హత్య చేసిన వాలంటీర్ కు శిక్ష పడే వరకు వరలక్ష్మి కుటుంబ సభ్యులకు న్యాయపరమైన మద్దతు అందిస్తాం" అన్నారు.

ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.శివశంకర్, పార్టీ నేతలు పంచకర్ల రమేష్ బాబు, సుందరపు విజయ్ కుమార్, పి.ఉషాకిరణ్, పి.వి.ఎస్.ఎన్.రాజు, పంచకర్ల సందీప్, వి. గంగులయ్య, మూగి శ్రీనివాస్, కందుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



# శ్రామిక మహిళల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

**బేబిరాణి సిఐటియు అఖిలభారత ఉపాధ్యక్షురాలు**




విశాఖపట్నం **(విజయభాను న్యూస్)** : శ్రామిక మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని సిఐటియు అఖిలభారత ఉపాధ్యక్షురాలు, అంగన్‌వాడీ వర్కర్స్ & హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు కాజి.బేబిరాణి డిమాండ్ చేసారు. (శనివారం) మధ్యాహ్నం డాబాగార్డెన్స్‌లో గల అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో సిఐటియు శ్రామిక మహిళా విశాఖ జిల్లా సదస్సు ఎల్ఐసి యూనియన్ నాయకులు సూర్యప్రభగారి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య వ్యక్తగా హాజరైన బేబిరాణి గారు మాట్లాడుతూ శ్రామిక మహిళలు ఎంతో శ్రమకోర్చి తమ కుటుంబాలకు పోషించడం కోసం పనిచేస్తువుంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వారిపై రోజురోజుకి పని భారాలు మోపుతూ వారి ఏ విధమైన కార్మిక చట్టాలు అమలు చేయకుండా అత్యంత తక్కువ వేతనాలతో వారి శ్రమను దోచుకుంటుందన్నారు. ఆకాశంలో సగం జనాభాలో సగంగా వున్న మహిళలు అన్ని విభాగాల్లో ముందుకు దూసుకువెళ్ళుతున్నారన్నారు. పేదవారికి సహాయం అందిస్తున్నటువంటి అనేక స్కీమ్స్‌లో మహిళ కార్మికులు అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్నారన్నారు. మహిళలు కుటుంబంలోను, పని ప్రదేశంలోను, సమాజంలోను అన్నివైపుల వివక్షతకు గురౌతున్నారన్నారు. మహిళ యొక్క ప్రత్యేకమై సమస్యలను చర్చించేందుకు ఇటువంటి సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు.

కేంద్రంలో బిజెపి అధికారంలోనికి వచ్చిన తరువాత మహిళల పట్ల అతి కిరాతంగా వ్యవహరిస్తుదని, మహిళ హక్కులను కాలరాస్తుందన్నారు. మహిళలను వంట ఇంటికే పరిమితం చేయాలనే మనుధర్మశాస్త్రాన్ని బిజెపి అమలు చేస్తుందన్నారు.

మహిళలకు రాత్రివేళల్లో డ్యూటీలు వేయకూడదని చట్టాలున్నా అది అమలు చేయటం లేదన్నారు. మహిళ కార్మికులు పనిచేస్తున్న చోట లైంగిక వేధింపుల నిరోధిక కమిటీలను అన్ని చోట్ల ఏర్పాటు చేయాలసివుందన్నారు. మహిళలకు ప్రత్యేకంగా రెస్ట్‌రూమ్స్, క్రెచ్చ్‌లు ఏర్పాటు చేయాలి. అలాగే ప్రశూతి సెలవులు కల్పించవలసివుండగా చాలా ప్రైవేటు యాజమాన్యాలు వీటిని అమలు చేయటం లేదన్నారు.

మహిళలే అత్యధికంగా పనిచేస్తున్న బ్యాండెక్స్, ఎస్ఇజెడ్‌లో వారి తో వెట్టిచాకిరి చేయించుకుంటూ వారిని అనేక వేధింపులకు గురిచేస్తుందన్నారు. ఇటువంటి సమస్యలపై శ్రామిక మహిళా సదస్సులో చర్చించి వాటి పరిష్కారం కోసం కార్యాచరణ రూపొంది స్తామన్నారు.

ఈ సదస్సులో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్, కార్యదర్శి పి.మణి, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తులసి, దేవి, ఆశా యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పద్మ, మేరీ, మిడ్డేమీల్స్ యూనియన్ కార్యదర్శి మంగశ్రీ, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు అనసూయ, మున్సిపల్ యూనియన్ కార్యదర్శి బి.రత్నం, ఎల్.ఐ.సి. డివిజన్ అధ్యక్షులు ఎం.కామేశ్వరి ఆర్.పి. యూనియన్ అధ్యక్షులు అలివేణి మరియు హాస్పిటల్స్, షాప్స్, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్, ఇంటిపనివారు తదితర సంఘాల నుండి శ్రామిక మహిళ నాయకులు హాజరయ్యారు.

# విజయభాను సంపాదకీయం

## నిజాన్ని ఎదుర్కోలేక...

నిజాలను ఎదుర్కోలేని వారు అసత్య ప్రచారాన్నే నమ్ముకుంటారు. మోడీ సర్కారు పరిస్థితి అలాగే ఉంది. గోడీ మీడియా ద్వారా నిరంతరం అబద్ధాలను ప్రచారంలో పెట్టి ప్రజల మధ్య విద్వేషాలు సృష్టించడం, లేని అభివృద్ధిని గ్రాఫిక్స్‌లో చూపించడం అలవాటైన కేంద్ర ప్రభుత్వానికి నిజాలు నిద్రపట్టనీయడం లేదు. అందుకే గద్దెనెక్కింది మొదలు గణాంకాల గొంతు నులిమేందుకు సర్వప్రయత్నాలు చేస్తోంది. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ పరిధిలో ఉంటూ జాతీయ కుటుంబ సర్వేలు నిర్వహించే ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ పాపులేషన్ సైన్సెస్ (ఐఐపిఎస్) డైరెక్టర్ కెఎస్ జేమ్స్‌ను కేంద్రప్రభుత్వం ఇటీవల సస్పెండ్ చేసింది. సంస్థ విడుదల చేసిన సర్వే వివరాలు... సాక్షాత్తూ ప్రధాని చెబుతున్న మాట లన్నీ అబద్ధాలని నిర్ధారించిన నేపథ్యంలోనే ఈ సస్పెన్షన్ జరిగింది. స్వచ్ఛభారత్, ఉజ్వల యోజన తదితర పథకాల అమలుపై మోడీ సర్కారు ప్రచారమంతా శుద్ధ అబద్ధమని ఐఐపిఎస్ సర్వే బహిర్గతం చేసింది. స్వచ్ఛ భారత్ మిషన్ ప్రారంభించి ఐదేళ్లయిన సందర్భంగా దేశం బహిరంగ మల విసర్జన (ఒడిఎఫ్) నుంచి పూర్తిగా బయటపడిందని, 60 కోట్ల మంది ఆ అలవాటుకు దూరమయ్యారని 2019 అక్టోబర్ 2న ప్రధాని నరేంద్రమోడీ ఘనంగా ప్రకటించారు. ఐఐపిఎస్ సర్వే-5లో నేటికీ దేశంలో దాదాపు ఐదో వంతు (19 శాతం) కుటుంబాలు మరుగుదొడ్లు లేకపోవడంతో ఆరుబయటకు పోతున్నారని నిర్ధారణ అయ్యింది. గ్రామీణ మహిళలకు సబ్సిడీపై వంట గ్యాస్ అందిస్తున్నందున వారికి కన్నీళ్లు తప్పాయని కేంద్రం ప్రచారం చేసుకుంటోంది. తాజా సర్వేలో 57 శాతం ఇళ్లకు వంట గ్యాస్ సౌకర్యం అందుబాటులో లేదని తేలింది. ఆరు నెలల నుంచి ఐదేళ్లలోపు చిన్నారుల్లో రక్తహీనత గత సర్వేల్లో కంటే అధికంగా ఉందని సర్వే తేల్చింది. 'పోషణ్ అభియాన్' పేరుతో కేంద్రం ప్రచారం హోరెత్తిస్తుండగా.. దేశంలో రక్తహీనత భారీ స్థాయిలో ఉందని ఈ సర్వే నిర్ధారించింది. ఫిబ్రవరిలో ఐఐపిఎస్ కౌన్సిల్ సమావేశంలో రక్తహీనతకు సంబంధించి సంస్థ ఇచ్చిన డేటాపై కేంద్ర ఆరోగ్యమంత్రి మాండవీయ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇది పశ్చిమ దేశాల కుట్రలో భాగమేనా? అంటూ జేమ్స్‌ను ప్రశ్నించారు. అంతేగాక సర్వే-6లో రక్తహీనతకు సంబంధించి వివరాలు లేకుండా చేసేశారు. వినిమయం, వ్యయం తదితర అధ్యయనాలను మోడీ ప్రభుత్వం తన మొదటి విడత పాలనాకాలంలోనే పక్కనపెట్టింది. సర్వేల కొలబద్దలను మార్చేసింది. జాతీయ స్థూల ఉత్పత్తి (జిడిపి) లెక్కింపునకు ప్రామాణిక సంవత్సరాన్ని మార్చేసింది. హౌస్‌హోల్డ్ సర్వేకు 2011-12 ఏడాది బేస్ ఇయర్‌గా ఉండగా, 2017-18ని ప్రామాణికంగా తీసుకుంటామని ప్రకటించింది. 2019 జనవరిలో దేశంలో నిరుద్యోగంపై వచ్చిన సమాచారాన్ని సార్వత్రిక ఎన్నికలు ముగిసే వరకూ తొక్కిపెట్టింది. ఈ చర్యకు నిరసనగా జాతీయ గణాంకాల కమిషన్ తాత్కాలిక ఛైర్మన్ పిసి మోహనన్ సహా పలువురు సభ్యులు రాజీనామా చేశారు. 150 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా పదేళ్లకు ఒకసారి చేయాల్సిన జనగణనను వాయిదా వేస్తూ వస్తోంది. ప్రణాళికా సంఘాన్ని అటకెక్కించింది. నీతి ఆయోగ్ పేరుతో తనకు నచ్చిన నివేదికలు తయారు చేయించుకుంటూ రాష్ట్రాల నిధులను కొల్లగొడుతోంది. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేలు చేయడం, ప్రభుత్వం నిర్దేశించే ఇతర బాధ్యతలు నిర్వహించేందుకు కేంద్ర హోం మంత్రిత్వశాఖ ఆధ్వర్యాన 2018లో ముంబై కేంద్రంగా ఐఐపిఎస్ ప్రారంభమైంది. దాని డైరెక్టర్ జేమ్స్ నేతృత్వంలో ఐఐపిఎస్ ఎంతో చురుగ్గా పనిచేస్తూ డేటా సేకరణ, విశ్లేషణల్లో కొత్త విధానాలు ప్రవేశపెట్టిందని పలువురు ప్రజారోగ్య రంగ నిపుణులు ప్రశంసిస్తున్న తరుణంలో ఆయనను సస్పెండ్ చేయడం గర్హనీయం. శాస్త్రవేత్తలు, ప్రతిపక్షాల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తం కావడంతో నిధులు, నియామకాలు, రిజర్వేషన్లు తదితర విషయాల్లో అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలు రావడంతో సస్పెన్షన్‌లో పెట్టామంటూ ప్రభుత్వం ఒక ప్రకటన విడుదల చేసింది. కేంద్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి, ఇద్దరు అదనపు కార్యదర్శులు సభ్యులుగా ఉన్న 12 మంది కమిటీ ఆధ్వర్యాన జరిగే నియామకాలకు ఆయన ఒక్కడే బాధ్యుడెలా అవుతాడో ఏలిన వారికే తెలియాలి. వాస్తవాలను స్వీకరించి సరిదిద్దుకోకుండా నిజాలను పాతరేసేందుకు చేసే ప్రయత్నాలు బెడిసికొడతాయని చరిత్ర మనకు చెబుతోంది. నిజం నిప్పు లాంటిది. దాన్ని ఎవరూ దాచిపెట్టలేరు.

# భవిష్యత్ గ్యారెంటీ పథకాలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలి



అనంతగిరి విజయభాను. న్యూస్ : రాష్ట్ర SC,ST కమీషన్ మాజీ సభ్యులు, అరకు నియోజకవర్గ టీడీపీ యువనేత సివేరి అబ్రహం అల్లూరి సీతారామరాజు జిల్లా ఆనంతగిరి మండలం టొకురు పంచాయతీ సిసగుడ గ్రామంలో సివేరి అబ్రహం శనివారం పర్యటించారు.ముందుగా పార్టీ నేతలతో సమావేశమై అందరూ సమిష్టితో భవిష్యత్తు గ్యారంటీ పథకాలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని సూచించారు అనంతరం టీడీపీ నాయకులతో కలిసి ఇంటింటికి తిరిగి భవిష్యత్ గ్యారంటీ పథకాల కరపత్రాలను అందిస్తూ వైసీపీ ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. గిరిజన ప్రాంత అభివృద్ధి తెలుగుదేశంతోనే సాధ్యమని రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే అన్ని విధాలుగా గిరిజన ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని అబ్రహం తెలిపారు. ఈ కార్యక్రమంలో టోకురు ఎంపిటిసి సభ్యురాలు,మాజీ సర్పంచ్ టోకురు దొన్ను,అరకు పార్లమెంట్ మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి రెహమాన్, ఎస్టి సెల్ మండల అధ్యక్షుడు కళారాజు,తెలుగు యువత చిరంజీవి, రాజు తదితరులు పాల్గొన్నారు

# భోగాపురంలో నా భూమి - నా దేశం

**- దేశం కోసం పోరాడుతున్న సైనికులను గౌరవిద్దాం**

**- సర్పంచ్ లాలం లక్ష్మీ పైడికొండ**




అచ్యుతాపురం (విజయభాను న్యూస్) : దేశం కోసం పోరాడుతున్న సైనికులను గౌరవించడం మన బాధ్యతని భోగాపురం సర్పంచ్ లాలం లక్ష్మీ పైడికొండ అన్నారు . శనివారం మండలంలో భోగాపురం గ్రామంలో నిర్వహించిన నా భూమి నా దేశం , నేలతల్లికి నమస్కారం - వీరులకు వందనం కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి , సర్పంచ్ లాలం లక్ష్మీ పైడికొండ శిలాఫలకాన్ని ఆవిష్కరించి , ప్రతిజ్ఞ చేశారు . ఈ సందర్భంగా స్వాతంత్ర పోరాటంలో ప్రాణాలు ధారపోసిన వీరులకు నివాళులర్పించి మొక్కలు నాటారు . ఈ కార్యక్రమంలో శేషు , సచివాలయ సిబ్బంది , గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు .

## కేసీఆర్ పాలనలో పేపర్లపైనే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు : కిషన్‌రెడ్డి



హైదరాబాద్, : భారాస ప్రభుత్వానికి పేదల సమస్యల పట్ల చిత్తశుద్ధి లేదని కేంద్ర మంత్రి, భాజపా తెలంగాణ అధ్యక్షుడు కిషన్ రెడ్డి అన్నారు. పేదలందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఇందిరా పార్కు వద్ద భాజపా మహా ధర్నా నిర్వహించింది. ఈ ధర్నాలో కేంద్ర మంత్రి పాల్గొని మాట్లాడారు. కేసీఆర్ పాలనలో రెండు పడక గదుల ఇళ్లు పేపర్లపైనే ఉంటాయని, భూమి మీద ఉండవని విమర్శించారు. పేదలకు ఇళ్లు ఇవ్వకపోతే ఓట్లు అడగనని 2017లో సీఎం కేసీఆర్ అన్నారని గుర్తుచేశారు. "ప్రగతిభవన్‌ను 4 నెలల్లో, సచివాలయాన్ని 8 నెలల్లో కట్టుకున్నారు. పేదలకు ఇచ్చే ఇళ్లపై కేసీఆర్‌కు చిత్తశుద్ధి లేదు. పేదలకు ఇళ్లు కడితే.. కేంద్రం వాటా తీసుకొచ్చే బాధ్యత నాది. రాష్ట్ర సంపదను భారాస నేతలు దోచుకుంటున్నారు. దళితబంధు పేరుతో సీఎం దళితులను మోసం చేశారు. నిరుద్యోగ భృతి పేరుతో విద్యార్థులను దగా చేశారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ వస్తేనే పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు వస్తాయి. కేసీఆర్ మళ్లీ అధికారంలోకి వస్తే పేదలకు ఇక ఎప్పుడూ ఇళ్లు రావు. ఎన్నికల ముందు గృహలక్ష్మి పేరిట మరోసారి కేసీఆర్ గారడీ చేస్తున్నారు" అని కిషన్ రెడ్డి ఆరోపించారు.

# కవి సమయం

## శ్రీకృష్ణ దేవుడు

అదిగదిగో దేవుడు
శ్రీ కృష్ణ దేవుడు
సర్వ మంతా వున్నాడు.
పరమాత్ముని తలచుటయే పుణ్యమైన దినమని
ప్రతి దినము పరమావది మీరని
గోవర్ధన గిరినెత్తి-భయమన్నది పోగొట్టి
వెతలు మోత మోసిరి- ప్రజలు చెంత నిలిచిరి
క్షణమంత పిలుపుతో - సాయమెంతో వుందని
శ్రమజీవన సాధనలో - సర్వజీవ రాసివి;
కొరత లేని జీవనం - ప్రతి ప్రాణికి ప్రాప్తివి.
పాడగా పాటయందు
ఆడగా ఆటయందు
పనిపాటులు యందును
చిత్తం, శరణం అనుకొని
లేనిదంటు తీరెను
ఉన్నదెంతో యిచ్చెను
విశ్వమంత దివ్యము - దివ్యమైన తేజము.

కవిత రచన :
మజ్జి శ్యామసుందరరావు

# పంచాంగం


ద్వాదశి ఉ. 8.56 ఆరుద్ర ఉ. 8.56
ఆరుద్ర ఉ. 10.08 వ.రా. 11.06 12.49

ఆదివారం
13-08-2023

a **మేషం** : ప్రవేట్ ఫైనాన్సులో మదుపు, వ్యక్తులకు రుణం ఇవ్వటం క్షేమం కాదు. మీ ఆలోచనలు, పథకాలు కార్యరూపం దాల్చుతాయి. భాగస్వామిక చర్చలు, సంప్రదింపులకు అనుకూలం. స్త్రీలకు ఆరోగ్యం పట్ల శ్రద్ధ అవసరం. శాస్త్ర రంగాల వారికి పరిశోధనలు, ప్రయోగాలకు మంచి గుర్తింపు లభిస్తుంది. మీ వాహనం, విలువైన వస్తువులు జాగ్రత్త. గృహ నిర్మాణాలు, మరమ్మతులకు అనుకూలం. b **వృషభం** : విద్యార్థులు మానసికంగా స్థిమితపడతారు.ఉద్యోగస్తులు సమర్థంగా పనిచేసి పై అధికారులను మెప్పిస్తారు. ఒక కార్యం నిమిత్తం ఆకస్మికంగా ప్రయాణం చేస్తారు. స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల వారికి పురోభివృద్ధి కానవస్తుంది. c **మిథునం** :ఎల్ఐసి, పోస్టల్ ఏజెంట్లు, రిప్రజెంటేటివ్‌లు టార్గెట్‌లను అధిగమిస్తారు. ఉపాధ్యాయులకు, రిప్రజెంటేటివ్‌లకు సదవకాశాలు లభిస్తాయి. స్త్రీలకు ఆరోగ్యంలో అధికమైన జాగ్రత్త అవసరం. d **కర్కాటకం** : స్థిరాస్తుల అమ్మకానికై చేయు యత్నాలు వాయిదాపడతాయి. ఉద్యోగస్తులకు అధికారులతో అప్రమత్తత అవసరం. విద్యార్థులకు మిత్రబృందాలు, వ్యాపకాలు అధికం కాగలవు. దీర్ఘ కాలికంగా వేధిస్తున్న సమస్యలు పరిష్కాం´మవుతాయి. అంతగా పరిచయం లేని వ్యక్తులకు దూరంగా ఉండటం మంచిది. e **సింహం** : విద్యార్థులు మానసికంగా స్థిమితపడతారు. దంపతులకు ఏ విషయంలోను పొత్తు కుదరదు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. గృహమార్పు యత్నం అనుకూలిస్తుంది. స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల వారికి పురోభివృద్ధి కాన వస్తుంది. f **కన్య** : ధనసహాయం చేసే విషయంలో అప్రమత్తత అవసరం. దైవ దర్శనాలలో ఇబ్బందులను ఎదుర్కొంటారు. ఉద్యోగస్తులు ఓర్పు, నేర్పుతో విజ యాన్ని సాధించగలరు. మధ్యవర్తిత్వం వహించటం వల్ల మాటపడక తప్పదు. మార్కెటింగ్ రంగాల్లో ఒత్తిడి పెరుగుతుంది. పాత వస్తువుల వల్ల ఇబ్బం దులు తలెత్తుతాయి. g **తుల** : నిరుద్యోగులు చేపట్టిన ఉపాధి పథకాల్లో నిల దొక్కు కుంటారు. జీవితభాగస్వామి ద్వారా ఆర్థిక లాభం పొందుతారు. చిన్నతరహా పరిశ్రమలు, చిరు వ్యాపారులకు సామాన్యం. ప్రముఖుల కలయిక వల్ల ఆశించిన ఫలితం ఉంటుంది. నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు, బిల్డర్లకు స్వీయ పర్యవేక్షణ ముఖ్యం. h **వృశ్చికం** : దీర్ఘకాలిక రుణాలు తీరుస్తారు. మీ ఆంతరంగిక విషయాలు గోప్యంగా ఉంచండి. ప్రేమికుల అత్యుత్సాహం అనర్థాలకు దారి తీస్తుంది. రావలసిన ధనం వసూలు కావటంతో మీ ఆలోచనలు పలు విధాలుగా ఉంటాయి. కొంతమంది మీ నుంచి ధనం లేక ఇతరత్రా సహాయం ఆర్థిస్తారు. ముఖ్యుల రాకపోకలు అధికం అవుతాయి. i **ధనుస్సు** : వృత్తి వ్యాపారులకు అన్నివిధాలా అనుకూలం. కీలకమైన సమస్యలు పరిష్కారం కావటంతో మీలో కొత్త ఉత్సాహం కనిపిస్తుంది. కుటుంబీకుల కోరికలు తీరుస్తారు. చేపట్టిన పనులు ఆశించినంత చురుకుగా సాగవు. భాగస్వామిక చర్చల్లో మీ అభిప్రాయాలకు ఆమోదం లభిస్తుంది. ఉద్యోగస్తులు కొత్త బాధ్యతలు స్వీకరిస్తారు. j **మకరం** : ఒక కార్యం నిమిత్తం ప్రయా ణం చేస్తారు. పత్రికా సంస్థలలోని వారికి ఊహించని సమస్యలెదురవుతాయి. దంప తుల మధ్య చిన్న చిన్న కలహాలు, చికాకులు తప్పవు. కోర్టు వ్యవహారాల్లో కొంత పురోగతి కనిపిస్తుంది. డాక్టర్లు అరుదైన చికిత్సలు విజయవంతంగా పూర్తిచేస్తారు. సభలు, సమావేశాల్లో చురుకుగా పాల్గొంటారు. k **కుంభం** : దీర్ఘకాలిక రుణాలు తీరుస్తారు. మీ ఆంతరంగిక విషయాలు గోప్యంగా ఉంచండి. ప్రేమికుల అత్యుత్సాహం అనర్థాలకు దారితీస్తుంది. రావలసిన ధనం వసూలు కావటంతో మీ ఆలోచనలు పలు విధాలుగా ఉంటాయి. L **మీనం** : విద్యార్థులు మానసికంగా స్థిమితపడతారు. దంపతులకు ఏ విషయంలోను పొత్తు కుదరదు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. గృహమార్పు యత్నం అను కూలిస్తుంది. స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల వారికి పురోభివృద్ధి కానవస్తుంది. అయినవారితో ఉల్లాసంగా గడుపుతారు. నిరుద్యోగులకు ఉపాధి పథకాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. ఆలయాలను సందర్శిస్తారు.

# భక్తి వాఙ్మయంలో భజగోవిందం

## సంకీర్తన



క్షణక్షణం మానవ జాతి యావత్తు అశాంతితో కొట్టుమిట్టాడు తోంది. స్వార్థము, మోహము, తృష్ణ, డంభములతో నడిచే మానవ జాతికి సత్సాంగత్యము, భగవద్భక్తి మొదలైన ఆర్షధర్మములే ప్రశాంతిని చేకూర్చగలవు. శంకర భగవత్పాదులు అందించిన భజగోవింద స్తుతి భక్తివాఙ్మయములో అద్వితీయ మైనది. ధార్మిక ప్రబోధము, విష్ణుభక్తి ప్రేరకముఅగు ఈ స్తుతికిగల భక్తిప్రచారము అనన్యసామాన్యము. దీనికి మోహముద్గరమని నామాంతరము కలదు. ఈ స్తుతి పండితులనుండి పామరుల వరకూ జీవన సత్యాన్ని బోధిస్తుంది. దీనిని పఠించుటవలన, అందలి సారాన్ని కొంతలోకొంతైనా ఆచరించిన జన్మ ధన్యత నొందగలదు. ఈ స్తుతి ఛందములోను, పద్య శిల్పము లోను, భావగౌరవములోను పదముల పొందికలోను అత్యంత రమణీయమైనది. శంకర భగవత్పాదులు అపర శంకరావతారం కారణజన్ములు. 32 సంవత్సరములే జీవించినా శంకరులు ఆనాటి సాంఘీక, సామాజిక, ఆధ్యాత్మిక స్థితిగతులను సమూలాగ్రంగా సమీక్షించి, భారత జాతిని ఒక్క త్రాటిపై తెచ్చిన ఘనత వీరికే చెందుతుంది. హిందూ మతస్థులందరికీ, అన్ని శాఖలవారికి అనువుగా స్తోత్రరాజాలను రచించిన ఘనత ప్రప్రథమంగా శంకరులకే చెందుతుంది. మూడు పర్యాయములు భారతదేశ సంపూర్ణ యాత్రచేసి అద్వైత తత్వాన్ని ప్రతిపాదించిన మహనీయులు శంకర భగవత్పాదులు. నాలుగు చెరగులా నాలుగు శంకరాచార్య పీఠాలను స్థాపించి ఆధ్యాత్మిక ప్రతిపత్తి కల్పించిన పరివ్రాజకుడు శ్రీ శంకర భగవత్పాదులు. ఒక విధంగా భారతీయ జీవన విధానాన్ని దిశానిర్దేశనం చేసిన మహోన్నత వ్యక్తి శ్రీ శంకర భగవత్పాదులు. అసలు భజగోవింద స్తుతి రచించటానికి ఒక వృద్ధుడు కారణభూతుడు. వ్యాకరణ పాఠాన్ని వల్లెవేయుటంవలన ప్రయోజనం లేదని గోవిందుని భజించుటయే ముఖ్యమని, అదే మానవ జన్మకు తరుణోపాయమని భజగోవింద స్తుతిని అందించారు శంకర భగవత్పాదులు. మొదటి శ్లోకంలో భజగోవింద మూడుసార్లు అనటంలో పునరుక్తి దోషములేదనుట భాషాకోవిదుల అభిప్రాయం. విషయము అర్థమైన రీతిలో నివేదిం చటంలో ఔచిత్యమున్నది. మొదటిసారి దీక్షాగురువులు గోవింద పాదులవారిని స్మరించటం, రెండవసారి శ్రీమన్నారాయణు ని మూడవసారి తత్వభూతమైన స్వరూపాన్ని స్మరించారని వ్యాఖ్యానకారుల అభిప్రాయం. ఇక శ్లోకాల విషయానికి వస్తే అత్యాశలేని జీవితం. ఉన్నదానిలో సంతృప్తి చెందటం (మూఢ జహిహిధనాగమతృష్ణా), మోహాన్ని వదలి మానవీయంగా బ్రతుకుట నేర్చుకోవాలి (నారిస్త్యన భరనాభిదేశం), స్వజనులు వ్యవహరించేరీతి. మరణ సమయంలో భార్యాపిల్లలు భీతి చెందుట (యావత్పదనో నిరసతిదేహీ) వివరిస్తారు. అలాగే యదార్థతత్వాన్ని చింతన చేయాలి (కాతేకాన్తాకస్తే పుత్రః), నిస్సంగత్వం, నిర్మోహత్వం, నిశ్చలతత్వం, జీవనముక్తి హేతువు (సత్సంగత్వే నిస్సంగత్వం)గా స్వీకరిస్తూ ధనవన గర్వాన్ని వీడి శాశ్వతతత్వాన్ని పొందే ప్రయత్నం చేయాలి. (మాకురువన గర్వ) సజ్జన సాంగత్యంతోనే జన్మతరిస్తుంది (కాతేకాన్తానగత చింతా), బహుకృత వేషాలతో జీవిత వలయంలో చిక్కుకొని సత్యదర్శనాన్ని పొందటంలేదు. (జటిలో ముండిలుంచితకేశః) అంతేగాదు జ్ఞానవిహీనునికి గంగాసాగర గమనం ముక్తినందించదని (కురుతే గంగాసాగర గమనం) సర్వసంగ పరిత్యాగికి సుఖానుభూతి సులభతరమని (యోగరతోవా భోగరతోవా), నేనెవరినని ప్రశ్నించుకుంటే సంసార స్వప్నతుల్యమని (కస్త్వంకో అహంకుత ఆయాతః) బోధపడుతుంది. సమచిత్తుడవైతేనే పరమాత్మను పొందగలవు. (త్వయిమయిచ అన్యత్రైకోవిష్ణుః), సమత్వభావన అలవరచుకుంటే (శత్రేమిత్రౌపుత్రౌ బంన్ధ్), సో అహం తత్వాన్ని గ్రహించగలవు. (కామక్రోధంలోభం మోహం). అలాగే ధనార్జనవల్ల శుఖము కలుగదు (అర్థమనర్థం భారయ నిత్యం). చివరగా ప్రాణాయామం, జపతపాదుల వలన సత్యతత్వం బోధ పడుతుంది.

(ప్రాణాయామం ప్రత్యాహారం). గురువు నాశ్రయించిన వానికి పరమాత్మ దర్శనం సులభతరవౌతుంది. ఎటొచ్చి వాటిని ఆచర ణాత్మకం చేసినపుడే వ్యక్తి సంస్కారవంతుడు కాగలడు. ఇటువంటి జీవన సత్యగుళికలని మనిషి పుట్టుకనుండి మరణం వరకు అన్ని ఇతివృత్తాలని తత్వవిచారంగా 32 ఏళ్ళ వయస్సులో రచించటం శంకర భగవద్పాదులు, అవతార పురుషులని ఘంటాపథంగా చెప్పవచ్చు.

ఈ శ్లోకాలను పఠించాలి, అందలి మూలార్థాన్ని స్వీకరించి మానవ జన్మను సార్థకత చేసుకోవాలి. శంకరాచార్య రచించిన కనకధారా స్తవము, సౌందర్య లహరి ఇత్యాది రచనలు దైనం దినంగా దీక్షాతత్పరులుగా పఠిస్తే సర్వకార్యసిద్ధి లభించుటయే గాక, మానసిక ప్రశాంతత సిద్ధించగలదు.

# శంకర్ ఫౌండేషన్ అద్వైర్యంలో అత్యాధునిక కంటి వైద్య సేవలు





గాజువాక( విజయభాను న్యూస్) : శంకర్ ఫౌండేషన్ అద్వైర్యంలో అత్యాధునిక కంటి వైద్య సేవలు అక్టోబర్ నుంచి అందుబాటులోకి వస్తున్నాయని, వాటిని కంటి రోగులు సద్వినియోగం చేసుకోవాలని శంకర్ ఫౌండేషన్ యాజమాన్యం తెలిపింది. శనివారం బి సి రోడ్ లో ఉన్న ఆ సంస్థ ఆసుపత్రి లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ గాజువాకలోని శంకర్ ఫౌండేషన్ ఐ హాస్పిటల్ విస్తృత పరుస్తున సేవలు, ఆధునిక ఆపరేషన్ థియేటర్ లను అక్టోబర్ 2023 నుండి ప్రారంభించనుందని తెలిపింది. గాజువాక (బిసి రోడ్)లోని ప్రముఖ కమ్యూనిటీ ఐ కేర్ సర్వీస్ హాస్పిటల్ అయిన శంకర్ ఫౌండేషన్ గాజువాక పారిశ్రామిక ప్రాంతంలోని కంటి రోగులకు వివిధ రకాలైన నాణ్యమైన సేవలను అందిస్తోందని తెలిపారు.

ఈ ప్రాంతంలో ఏంతో మంది కంటి సమస్యలతో భాధ పడుతున్నారని సరైన కంటి వైద్యం అందక ఆంధత్వం పాలవుతున్నారని అన్నారు. ప్రస్తుతం, గాజువాక శాఖ శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రిని ఇద్దరు సీనియర్ కంటి వైద్యులు, పారామెడికల్ సిబ్బంది, ఆప్టికల్ షాప్, ఫార్మసీ సహాయక పరిపాలన సిబ్బంది సేవలను అందిస్తున్నారని తెలిపారు. శంకర్ ఫౌండేషన్ ఐ హాస్పిటల్ కమ్యూనిటీకి సేవ చేయడానికి, దాని సేవలను విస్తరించే నిబద్ధతలో భాగంగా, గాజువాక బ్రాంచ్ అత్యాధునిక ఆధునిక ఆసుపత్రిగా అప్గ్రేడ్ చేయబడుతోందని అన్నారు. ఇందులో రెండు అల్ట్రా మోడ్రన్ ఆపరేషన్ థియేటర్లు, 20 పడకల సౌకర్యం, అత్యాధునిక రోగనిర్ధారణ విధానాలు ల్యాబ్ సౌకర్యం, ఆప్టికల్ షాప్, ఫార్మసీ మొదలైనవి పూర్తి స్థాయిలో ఉన్నాయిని, ఈ ఆసుపత్రిలో కంటిశుక్లం, రెటీనా ఆపరేషన్లు సహా అన్ని ఆధునిక సౌకర్యాలు కల్పిస్తారని తెలిపారు.

గాజువాకలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ మమతా మయీ పాణిగ్రాహి విలేకరులతో మాట్లాడుతూ గాజువాక పారిశ్రామిక ప్రాంత పౌరులు ఈ సౌకర్యాలను పూర్తిగా ఉపయోగించుకోవాలని, నివారించగల అంధత్వాన్ని సాధించడానికి ముందస్తుగా గుర్తించడానికి క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయాలని ప్రజలకు సూచించారు. అనేక పరిశ్రమలకు ఎంప్యానెల్ చేయబడిన రోగులకు చికిత్స చేయడానికి,చాలా బీమా కవరేజీలు, సిజి హెచ్ఎస్టిపిఐ మొదలైన వాటిని ఉచితంగా కవర్ చేయడానికి ఆసుపత్రిలో జనరల్ ఆప్తాల్మాలజీ, గ్లాకోమా, రెటీనా, పీడియాట్రిక్స్, ఆర్బిట్ మొదలైన అన్ని రోగనిర్ధారణ సౌకర్యాలు అందించబడుతున్నాయని ఆమె చెప్పారు. అనేక పరిశ్రమల చుట్టూ ఉన్న పారిశ్రామిక ప్రాంత ప్రజలు కంటికి సంబంధించి ఎటువంటి సమస్యలు ఉన్నా ఫౌండేషన్ ను సంప్రదించవచ్చని కోరారు.ఫౌండేషన్ స్థాపించిన 1997 నుంచి నేటి దాకా 4.18 లక్షల సర్జరీలు చేశామని,24.39 లక్షల మంది అవుట్ పేషెంట్లకు సేవలు అందించామని,2.99 లక్షల మంది స్కూల్ పిల్లలకు స్క్రీనింగ్ టెస్టులు జరిపినట్లు వివరించారు. పిల్లల్లో అంధత్వ నివారణకు అనేక చర్యలు తీదుకున్నామని తెలిపారు. ఈ సమావేశంలో డాక్టర్ నటాషా మారియా, కంటి కన్సల్టెంట్, కే బంగార్ రాజు, డిప్యూటీ జనరల్ మేనేజర్ (పి ఆర్ అండ్ లైజన్) సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచారసభ సర్వ సభ్య సమావేశం




విశాఖపట్నం **(విజయభాను న్యూస్) :** అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచారసభ, 16 సంవత్సరాలుగా దక్షిణ భారత దేశంలోని అన్ని రాష్ట్రాలలో వివిధ ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలు, అన్నదానం కార్యక్రమం మండలకాలం సమయంలో డిశంబర్ నుండి జనవరి మకర విళక్కు వరకు ఎరుమేళి, పళని, సింగోట్టాయి ప్రాంతాలలో నిర్వహించడం జరుగుతున్నది. అలాగే స్థానిక ఆలయాలలో సైతం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతున్నది. ఆదివారం విశాఖపట్నం లోని శంకరమఠం నందు ABAP జాతీయ సర్వ సభ్య సమావేశం మరియు జాతీయ కార్యవర్గ ఎన్నిక జరగనుంది. ఈ సమావేశానికి దక్షణ భారత దేశంలోని 5 రాష్ట్రాలలోని సభ్యులు పాల్గొంటున్నారు. 2023-20 5 రెండు సంవత్సరాల కాలానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నారు. అఖిల భారతీయ అయ్యప్పధర్మ ప్రచారసభ ముఖ్యంగా శబరిమలలోని ఆచార వ్యవహారలు, సాంప్రదాయాల పరిరక్షణపై పరిశ్రమిస్తున్నది. అదే విధంగా అయ్యప్ప స్వామి వారి నిజమైన చరిత్రను అన్ని రాష్ట్రాలలోని మారుమూల గ్రామీణ ప్రాంతాలలోని అయ్యప్ప భక్తులకు తెలిసేలా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నది.

ఇందులో బాగంగా ట్రావెన్ కోర్ దేవస్థానం బోర్డు వారి శబరిమల సమాచార కేంద్రాన్ని మొట్ట మొదటి సారిగా ABAP సహకారంతో విదేశాలలో మలేసియాలో గత సంవత్సరం ప్రారంభించడం జరిగింది. గత మార్చి 26న మొట్టమొదటిగా మనదేశంలో సమాచార కేంద్రాన్ని ముంబాయిలోని శంకరాలయం హరిహర పుత్ర భజన సమాజ అయ్యప్ప ఆలయం చెంబూరులో ప్రారంభించడం జరిగింది. దక్షిణ భారత దేశంలో మొట్ట మొదటి సారిగా విశాఖపట్నం లోని శంకరమఠంలో ప్రారంభించుటకు TDB అంగీకారం తెలిపింది. ఈ సమాచార కేంద్ర వలన విశాఖపట్నంలోని అయ్యప్ప భక్తులకు మరియు విశాఖపట్నం పరిసర జిల్లాలలోని అయ్యప్ప భక్తులకు శబరిమలలో జరిగే వివిధ పూజలు, కైంకర్యాలు సేవలు నమోదు చేసుకొనే అవకాశం ఉంటుంది. ఈ నెల 27వ తేదిన TDB (ట్రావెన్ కోర్ దేవస్థానం బోర్డు) శబరిమల సమాచార కేంద్రాన్ని బోర్డు అధ్యక్షుడు అడ్వకేట్ అనంత గోపన్, బోర్డు సభ్యులు అడ్వకేట్ జీవన్, జి. సుందరేశన్, శబరిమల మాజీ మేల్ శాంతి బ్రహ్మశ్రీ దామోదరన్ పోట్టి ప్రారంభించుచున్నారు. ఈకార్యక్రమంలో విశాఖపట్నంలోని గురుస్వాములు, అయ్యప్ప భక్తులు పాల్గొనాలని కోరుతున్నాము. ఈకార్యక్రమంలో అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచారసభ జాతీయ అధ్యక్ష్యులు కె. అయ్యప్పదాన్, ప్రధానకార్యదర్శి వై. బాలాంజనేయులు, కోశాధికారి LR రాజు, జాతీయ ఉపాధ్యక్షుడు లంక బాబు, జాతీయ కార్యదర్శి పిట్ట. శ్రీహరి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు బెల్లపు హరిప్రసాద్, కార్యదర్శి CH. శంకరాచారి, కోశాధికారి యం. శివనాగేశ్వరరావు, తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు R. వెంకటేశన్, కార్యదర్శి అనీష్ కుమార్, కోశాధి కారి వెంకటేశన్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు టేత్తి తిరుమలరావు, కార్యదర్శి పుల్లంరాజు, కోశాధికారి గంగాధర్ ఇరు తెలుగు రాష్ట్రాల సమస్వయకర్త రాచర్ల రమేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. పైల ఆదిమోహనరెడ్డి, రాష్ట్ర జోనల్ కార్యదర్శి రుద్రకోటేశ్వరరావు, విశాఖజిల్లా అధ్యక్షుడు నాగార్జున, కార్యదర్శి నరహరి, జాతీయ రాష్ట్ర కార్యవర్గసభ్యులు యం. కృష్ణయ్య, రాతినాయుడు, టి. శ్రీనివాసురావు, బి. నాగేశ్వరరావు. యస్. హరిప్రసాద్, ధర్మాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# సకల కళాకారుల సంఘం ప్రమాణ స్వీకారం

## - అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు




విశాఖపట్నం, ఆగస్టు 12 : విశాఖ సకల కళాకారుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం శనివారం ఉదయం విశాఖ పౌర గ్రంధాలయంలో ఘనంగా నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడిగా సినీ నిర్మాత కంచర్ల అచ్యుతరావు, అధ్యక్షురాలిగా సినీ కవి జాలాది కుమార్తె జాలాది విజయ, ప్రధాన కార్యదర్శిగా చెన్నా తిరుమలరావు, కార్యదర్శిగా కే లోకేశ్వరరావు, కోశాధికారిగా మధుపాడ రమణి, ఉపాధ్యక్షుడిగా జేఎంఆర్ నెహ్రూ, ఉపాధ్యక్షులుగా ఎం త్రినాధరావు, దండు నాగేశ్వరరావు, అరుణ్ సాయి కుమార్, సహాయ కార్యదర్శులుగా మిమిక్రి శ్రీనివాస్, కందర్ప రాధ, జీ జగదీష్, నిర్వాహక కార్యదర్శిగా కోరుకొండ రంగారావులతో పాటు మరో 13 మందిని సలహాదారులు, ఈసీ సభ్యులు ఉన్నారు. వీరితో మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా గౌరవాధ్యక్షులు కంచర్ల అచ్యుతరావు మాట్లాడుతూ కళాకారుల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తానని తెలిపారు. విశాఖ కళాకారుల కీర్తి నలుదిశలా వ్యాపించేలా ముందుకు కదలాలన్నారు. అధ్యక్షురాలు జాలాది విజయ మాట్లాడుతూ నగరంలోని కళాకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ పదవికి తగిన న్యాయం చేయడానికి తప్పకుండా నా వంతు ప్రయత్నం చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన నృత్యాలు, ఏక పాత్రాభినయం, సినీ గీతాలు, మిమిక్రి, డోనాల్డ్ డెక్ తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో సకల కళాకారుల అధినేతలు నరవ ప్రకాశరావు, బొట్టా వేణు, దండు నాగేశ్వరరావు, కొరిటాలా ప్రభాకర్, ఎంవీ రాజశేఖర్ పాల్గొన్నారు.

# ఉద్యోగుల ఇళ్ల స్థలాలపై సీఎస్ సమీక్ష..



విజయవాడ: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇళ్ళ స్థలాలు ఇచ్చే అంశంపై శనివారం విజయవాడలోని సీఎస్ క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కేఎస్.జవహర్ రెడ్డి అధికారులతో సమీక్షించారు. వివిధ ఉద్యోగ సంఘాల హౌసింగ్ సొసైటీల వారీగా ఇళ్ళ స్థలాలకు ఎంత మేర భూమి అవసరం ఉంది పరిశీలన జరపాలని రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సీసీఎల్ఏ జీ.సాయి ప్రసాద్ కు సీఎస్ సూచించారు. అంతేగాక ఈవిషయమై ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో చర్చించి ఒక నివేదిక సమర్పించాలని ఆదేశించారు.పది రోజుల్లో ఉద్యోగుల ఇళ్ళ స్థలాల అంశంపై ముఖ్యమంత్రి సమీక్షించనున్నారని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కెఎస్.జవహర్ రెడ్డి అన్నారు. పట్టణ ప్రాంతాల్లో పబ్లిక్ హౌసింగ్ విధానాన్ని తీసుకు వచ్చే అంశంపై దృష్టి సారించాలని అధికారులను సీఎస్ జవహర్ రెడ్డి సూచించారు.దానివల్ల పట్టణ ప్రాంతాల్లో ఇళ్ళు లేనివారు, ఇళ్ళు ఉన్నా రోడ్లు,ఫుట్ పాత్ లు,కాలువలు,డ్రైన్లు వంటి వివిధ ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుని చిన్న చిన్న గుడిసెలు,గుడారాలు వంటివి ఏర్పాటు చేసుకుని జీవనం సాగించే వారిని కట్టడి చేసి వారికి ప్రభుత్వమే పబ్లిక్ హౌసింగ్ విధానంలో నిర్మించిన ఇళ్ళలో నివసించేలా చేయవచ్చని తెలిపారు.దాంతో పట్టణాలను మరింత సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ద వచ్చని సిఎస్ పేర్కొన్నారు.

**ఆరోగ్య పథకంపై చర్చ..**

రాష్ట్రంలో ఉద్యోగులకు అమలు చేస్తున్న ఆరోగ్య పథకాన్ని(ఇహెచ్ఎస్)మరింత పారదర్శకంగా,పటిష్టవంతంగా అమలు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కె.ఎస్. జవహర్ రెడ్డి స్పష్టం చేశారు. ఉద్యోగుల ఆరోగ్య పథకంపై శనివారం విజయవాడలోని సీఎస్ క్యాంపు కార్యాలయంలో ఆయన వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్షించారు.ఈ పథకం అమలులో వివిధ ఉద్యోగ సంఘాల నుంచి వచ్చిన పలు డిమాండ్లు వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలపై ఆయన వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి యం.టి.కృష్ణబాబుతో సమీక్షించారు. మరో పది రోజుల్లో ఉద్యోగుల ఆరోగ్య పథకంపై ముఖ్యమంత్రి సమీక్షించనున్నారని సీఎస్ పేర్కొన్నారు.ఈపథకం అమలుపై ఇటీవల ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో వచ్చిన వివిధ ప్రతిపాదనలు వాటి అమలు గురించి సీఎస్ సమీక్షించారు.అంతేగాక ఈ పథకాన్ని మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా అమలు చేసేందుకు తీసుకోవాల్సిన అంశాలపై సీఎస్ జవహర్ రెడ్డి సమీక్షించారు. సెప్టెంబర్ నెలాఖరు నాటికి అందరికీ ఇహెచ్ఎస్ కార్డులు అందించే విధంగా చర్యలు తీసుకుంటామని స్పెషల్ సీఎస్ కృష్ణబాబు చెప్పారు.రాష్ట్రం లోని 53 ఏరియా ఆసుపత్రిల్లో ఇహెచ్ఎస్ సేవలకై ప్రత్యేక క్లినిక్లు అందుబాటులోకి రానున్నాయని కృష్ణబాబు తెలిపారు.ఇంకా ఇహెచ్ఎస్ అమలుకు సంబంధించి తీసుకున్న చర్యలపై వివరించారు.


# నిరూపించండి.. రాజీనామా చేస్తా..

## - డీసీఎం డీకే శివకుమార్ సవాల్



బెంగళూరు : కాంట్రాక్టర్ల నుంచి కమీషన్ డిమాండ్ చేసినట్లు నిరూపిస్తే రాజకీయాలకు గుడ్‌బై చెబుతానని తనపై ఆరోపణలు చేసిన మాజీ సీఎం బసవరాజ్‌బొమ్మై, మాజీ మంత్రి అశోక్‌లు అందుకు సిద్ధమా? అంటూ ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ సవాల్ విసిరారు. సదాశివనగర్‌లోని నివాసం వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంట్రాక్టర్ల సంఘం ప్రతినిధులు మీడియా ముందుకు రావడంపై స్పందించారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా మాట్లాడవచ్చు అన్నారు. కాంట్రాక్టర్లు ఎవరికి ఎంత ఇచ్చారననేది ప్రస్తావించేది లేదన్నారు. కానీ 10-15శాతం కమీషన్ ఎవరు అడిగారు, ఎవరు ఇచ్చారనేది ముఖ్యమన్నారు. సీఎం సిద్దరామయ్య(%జవీ రాఅఇుఖతీుఖఋుఖ్ఖష్త్ర%) అడిగారా లేక మంత్రులు, ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారా అనేది ముఖ్యమన్నారు. నేను కమీషనర్ కోరి ఉంటే ఈక్షణంలోనే రాజకీయాలకు గుడ్‌బై చెబుతానన్నారు. అశోక్ మాట్లాడింది చూశానన్నారు. 1.25లక్షల ఓట్ల తేడాతో ఓడిన డిపాజిట్ కోల్పోయారు. ఇంకేం కావాలని ప్రశ్నించారు. అజ్జయ్య మఠంలో ప్రమాణంకు డిమాండ్‌పై దారిలో పోయేవారి ప్రతిపాదనలను పట్టించుకునేది లేదంటూనే ఎవరికి ఎక్కడ సమాధానం చెప్పాలో తెలుసన్నారు. నిన్నమొన్నటి దాకా అధికారంలో ఉండే బసవరాజ్‌బొమ్మై ఎందుకు బిల్లులు చెల్లించలేదని ప్రశ్నించారు. నిధుల కొరతనా లేక నాసిరకం పనులా అనేది బహిరంగం చేయాలన్నారు. అధికారంలో నిర్లక్ష్యం చేసి ఇప్పుడు విమర్శలు చేయడమే విధిగా పెట్టుకున్నారన్నారు. బిల్లుల కోసం నాలుగైదేళ్ళు వేచి ఉండిన వారు నెలల పాటు ఆగలేరా అంటూ ధీటుగా సమాధానమిచ్చారు. కమీషన్ల వ్యవహారం రోజుకో మలుపు తిరుగు తుండడం, సవాళ్లు, ప్రతి సవాళ్లతో కీలక నాయకులు వాగ్వాదం చేస్తుండంతో అందరి దృష్టి దీనిపైనే మళ్లింది. సీఎం సిద్దరామయ్య చర్యలపై ఆసక్తి నెలకొంది.

# పెళ్లి పేరుతో మహిళను అనుభవించే దుష్టుడికి పదేళ్ల జైలు శిక్ష.. కేంద్రం ప్రతిపాదన..



న్యూఢిల్లీ : భారత శిక్షా స్మృతి 1860కి బదులుగా భారతీయ న్యాయ సంహిత ను తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. దీనికి సంబంధించిన బిల్లును కేంద్ర హోం మంత్రి అమిత్ షా పార్లమెంటుకు సమర్పించారు. వలసవాద ధోరణికి చెల్లుచీటీ రాస్తూ, అనేక సంస్కరణలను ప్రతిపాదించారు. మహిళలను మోసం చేసేవారిని కఠినంగా శిక్షించడం కోసం కూడా ప్రత్యేక నిబంధనలను ప్రతిపాదించారు. అమిత్ షా మాట్లాడుతూ, మహిళలపై నేరాలు, వారు ఎదుర్కొంటున్న అనేక సామాజిక సమస్యలను ఈ బిల్లులో ప్రస్తావించినట్లు తెలిపారు. పెళ్లి చేసుకుంటానని, ఉద్యోగం ఇప్పిస్తానని, పదోన్నతి కల్పిస్తానని మాయమాటలు చెప్పి ఓ మహిళ/యువతితో సంగమించడం, తన గురించి తప్పుడు వివరాలు చెప్పి ఓ మహిళ/యువతితో సంగమించడం నేరం అని ఈ బిల్లు చెప్తోందన్నారు. దీనిని నేరంగా పరిగణించడం ఇదే తొలిసారి అని చెప్పారు. పెళ్లి చేసుకుంటానని చెప్పి అత్యాచారం చేసినట్లు మహిళలు కోర్టులను ఆశ్రయించినపుడు, ఐపీసీలో దీనికి సంబంధించిన నిర్దిష్ట నిబంధన లేకపోవడంతో న్యాయస్థానాలు ఇబ్బందిపడుతున్నాయి. ఈ ఇబ్బందులను నివారించేందుకు తాజా బిల్లు ప్రయత్నిస్తోంది. "మాయోపాయాలతో లేదా పెళ్లి చేసుకుంటాననే వాగ్దానం చేసి, ఆ వాగ్దానాన్ని నెరవేర్చే ఉద్దేశం లేకుండా, ఓ యువతి/మహిళతో లైంగిక సంభోగంలో పాల్గొనే ఎవరైనా, అత్యాచారంగా పరిగణింపబడని అటువంటి లైంగిక సంభోగం చేసినందుకు, గరిష్ఠంగా పదేళ్ల వరకు జైలు శిక్షతో శిక్షింపబడుదురు, అదేవిధంగా జరిమానాకు కూడా పాత్రులగుదురు" అని ఈ బిల్లు ప్రతిపాదించింది. మాయోపాయాలు అంటే ఏమిటో కూడా ఈ బిల్లు వివరించింది. ఉద్యోగం ఇప్పిస్తానని, పదోన్నతి ఇప్పిస్తానని, తప్పుడు వాగ్దానం చేయడం, లేదా తన సొంత వివరాలను మరుగుపరచి పెళ్లి చేసుకోవడం, ప్రోద్బలం చేయడం మాయోపాయాలు అవుతాయని వివరించింది.


ఈ ప్రతిపాదనను న్యాయ నిపుణులు సమర్థిస్తున్నారు. ఇది లేకపోవడం వల్ల ఇప్పటి వరకు ఇటువంటి చర్యలను నేరాలుగా పరిగణించడం లేదన్నారు. ఇరు పక్షాలు తమకు నచ్చినట్లుగా అర్థాలు చెప్తున్నాయన్నారు. మతాంతర వివాహాలను అడ్డుకునేందుకే, 'సొంత వివరాలను మరుగుపరచి పెళ్లి చేసుకోవడం' అనే నిబంధనను పెట్టారని కొందరు ఆరోపిస్తున్నారు. పెళ్లి పేరుతో మహిళలకు అన్యాయం చేయడాన్ని నిరోధించడానికి ఇది దోహదపడుతుందని మరికొందరు అంటున్నారు.

# సైబర్ నేరాల బాధితుల్లో.. 95% విద్యావంతులే

హైదరాబాద్, సైబర్ మోసాలపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని చాట్ జీపీటీతో తమకు కావాల్సిన మేసేజ్‌లు తయారు చేసి బాధితులకు పంపిస్తున్నారని, ప్రతి విషయాన్ని ప్రజలు గమనించాలని ట్రై పోలీస్ కమిషనరేట్ సైబర్ క్రైమ్ డీసీపీలు సూచించారు. బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో ఫిక్కీ లేడీస్ అర్గనైజేషన్(ఎఫ్ఎల్ఓ) ఆధ్వర్యంలో 'అన్‌లాకింగ్ సైబర్ సీక్రెట్స్' అనే అంశంపై సదస్సును నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసి ఈ సదస్సును నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ప్రారంభించారు. అనంతరం, హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ సైబర్ క్రైమ్స్ డీసీపీలు స్నేహ మెహ్రా, డాక్టర్ అనూరాధ, రిత్‌రాజ్‌లు మాట్లాడుతూ శత్రువులు ఎవరో..? మిత్రుడు ఎవరో..? అనే తేడాను ప్రజలు కచ్చితంగా గుర్తించాలన్నారు. సైబర్ నేరాలలో బాధితులు ఎక్కువ మంది చదువుకున్న వారే ఉంటున్నారని, వీరిలో 95 శాతం ఉన్నత విద్యార్హత కల్గిన వారు, 80 శాతం సాఫ్ట్‌వేర్ నిపుణులే ఉంటున్నారని పేర్కొన్నారు.

# బరువు తగ్గించే రాగి అంబలితో ఎన్నో లాభాలు..!

**ధాన్యపు గింజలైన రాగుల్లో ఎన్నో రకాల పోషక పదార్థాలు ఉంటాయి. అవి మన శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. అయితే రాగులతో తయారు చేసే అంబలిని తాగడం వల్ల మనకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది. ప్రధానంగా బరువు తగ్గుతారు. ఇంకా చాలా లాభాలే ఉన్నాయి. ఈ క్రమంలో రాగి అంబలిని ఎలా తయారు చేయాలో, దాంతో మనకు ఎలాంటి ఉపయోగాలు ఉన్నాయో ఇప్పుడు తెలుసుకుందాం.**



రాగులను కొంత పరిమాణంలో తీసుకుని వాటిని కొన్ని గంటల పాటు నీటిలో నానబెట్టాలి. అనంతరం వాటిని శుభ్రమైన వస్త్రంలో కట్టి మళ్లీ కొన్ని గంటల పాటు ఉంచితే అవి మొలకెత్తుతాయి. కొన్ని సార్లు రాగులు మొలకెత్తడం ఆలస్యం కూడా అవచ్చు. అయినా కొంత సేపు నిరీక్షించి మొలకెత్తిన రాగులను సేకరించాలి. వాటిని బాగా ఎండబెట్టి దంచి పొడి చేయాలి. ఆ పొడిని కొంత నీటిలో వేసి బాగా ఉడికించాలి. దీంతో జావ తయారవుతుంది. ఇందులో అవసరం అయితే జీడిపప్పు, పల్లీలు, కిస్మిస్, తేనె వంటివి కలుపుకోవచ్చు. లేదంటే ఉప్పు, కారం కూడా కలపవచ్చు. అలా కలుపగా వచ్చేదే రాగి అంబలి. దీన్ని నిత్యం తాగితే మన శరీరానికి ఎంతో మేలు జరుగుతుంది.

1. రాగి అంబలి శరీరానికి మంచి బలాన్ని ఇస్తుంది. రోజంతా శరీరానికి కావల్సిన శక్తి, పోషకాలు రాగి అంబలి ద్వారా అందుతాయి. దీంతో ఎక్కువ సేపు పనిచేయవచ్చు. రోజంతా ఉత్సాహంగా ఉంటుంది.

2. ఎదిగే పిల్లలకు దీనిని ఇవ్వడం వల్ల శక్తివంతంగా తయారవుతారు. చదువుల్లో బాగా ప్రతిభను కనబరుస్తారు. మెదడు చురుగ్గా ఉంటుంది.

3. రాగి అంబలికి చలువ చేసే గుణం ఉంది. దీంతో శరీరంలో ఉండే అధిక వేడిని తగ్గించుకోవచ్చు.

4. ఒక గ్లాస్ రాగి అంబలి తాగినా చాలా సేపు ఆకలి వేయదు. దీంతో కడుపు నిండిన భావన కలుగుతుంది. ఆహారం ఎక్కువగా తినాలనిపించదు. ఇది బరువు తగ్గాలనుకునే వారికి మేలు చేస్తుంది. స్థూలకాయం ఉన్న వారు రాగి అంబలి తాగితే వేగంగా బరువు తగ్గవచ్చు.

5. ప్రతి రోజూ ఉదయం చేసే సాధారణ అల్పాహారానికి బదులుగా రాగి అంబలి తాగితే దాంతో మనం రోజంతా యాక్టివ్‌గా ఉండవచ్చు. శారీరక ద ృఢత్వం చేకూరుతుంది.

6. బీపీ, షుగర్ నియంత్రణలోకి వస్తాయి. రక్తస్రావం జరుగుతున్న వారికి రాగి అంబలి తాగిస్తే స్రావం ఆగిపోతుంది.

7. రాగి అంబలిని నిత్యం తాగుతుంటే పురుషుల్లో వీర్యం వ ృద్ధి చెందుతుంది.




# అనారోగ్య సమస్యలను మటుమాయం చేసే నువ్వుల నూనె...

**ఇప్పుడంటే అన్నీ రిఫైన్డ్ నూనెలు వచ్చాయి కానీ ఒకప్పుడు మన వాళ్లు గానుగల్లో ఆడించిన నూనెలనే ఎక్కువగా వాడేవారు. అలాంటి నూనెల్లో నువ్వుల నూనె కూడా ఒకటి. తెల్లనివి, నల్లనివి అని రెండు రకాలుగా ఈ నువ్వులు ఉంటాయి. వీటి నుంచి తీసే నూనెలో ఎన్నో రకాల పోషక పదార్థాలు ఉంటాయి. మన శరీరానికి అవసరమైన విటమిన్ ఇ, కాల్షియం, జింక్, ఐరన్, థయామిన్, ఒమెగా 6 ఫ్యాటీ యాసిడ్లు, ప్రోటీన్లు, యాంటీ ఆక్సిడెంట్లు నువ్వుల నూనెలో మనకు పుష్కలంగా లభిస్తాయి. ఈ క్రమంలో నువ్వుల నూనెను నిత్యం మన ఆహారంలో భాగం చేసుకుంటే కలిగే ప్రయోజనాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం.**



1. నువ్వుల నూనెలో విటమిన్ ఇ, బిలు పుష్కలంగా ఉన్నాయి. ఇవి చర్మాన్ని సంరక్షించడమే కాదు, అన్ని రకాల చర్మ సమస్యలను దూరం చేస్తాయి. నువ్వుల నూనెను తరచూ వాడడం వల్ల ముఖం కాంతివంతమవుతుంది. చర్మం మ ృదువుగా మారుతుంది.

2. నిత్యం స్నానం చేసే ముందు చిన్న పిల్లలకు నువ్వుల నూనెతో మర్దనా చేస్తే వారి శరీరం బాగా ఎదుగుతుంది. మెదడు పదునుగా మారుతుంది. చిన్నారుల్లో ఉండే కొవ్వు కరిగిపోతుంది. ఈ నూనెలో ఉండే పోషకాలన్నీ పిల్లలకు లభిస్తాయి. అయితే పెద్దలు కూడా స్నానానికి ముందు నువ్వుల నూనెతో మర్దనా చేసుకోవచ్చు.

3. నువ్వుల నూనెలో ఒమెగా-3,6 ఫ్యాటీ యాసిడ్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి బీపీని తగ్గిస్తాయి. శరీరంలో పేరుకుపోయిన కొలెస్ట్రాల్ నిల్వలను తగ్గిస్తాయి.

4. కాపర్, ఇతర పవర్‌ఫుల్ యాంటీ ఆక్సిడెంట్లు నువ్వుల నూనెలో ఉంటాయి. దీంతో ఇవి కీళ్ల నొప్పులను తగ్గిస్తాయి.

కొద్దిగా నువ్వుల నూనెను తీసుకుని కొంచెం వేడి చేసి మోకాళ్లపై రాసుకుంటే నొప్పులు, వాపులు తగ్గిపోతాయి.

5. పైన చెప్పిన విధంగా నువ్వుల నూనెను శరీరంపై కొవ్వు ఉన్న ప్రాంతాల్లో రాస్తే అధికంగా ఉన్న కొవ్వు కరిగిపోతుంది.

6. నువ్వుల నూనెలో ఉండే పోషకాలు ఎముకలకు ద ృఢత్వాన్ని ఇస్తాయి. రక్తనాళాలను శుభ్రం చేస్తాయి. శ్వాసకోశ సమస్యలను దూరం చేస్తాయి.

7. మధుమేహ వ్యాధి గ్రస్తులు నిత్యం 2 టేబుల్ స్పూన్ల మోతాదులో నువ్వుల నూనెను ఏవిధంగానైనా తీసుకుంటే వారి శరీరంలోని రక్తంలో ఉండే చక్కెర స్థాయిలు తగ్గుముఖం పడతాయి. దీని వల్ల షుగర్ నియంత్రణలో ఉంటుంది.

8. నువ్వుల నూనెతో తలకు మర్దనా చేస్తే జుట్టు బాగా పెరుగుతుంది. వెంట్రుకలు రాలడం తగ్గుతుంది. చుండ్రు సమస్య పోతుంది.


# చిన్నారుల్లో డిప్రెషన్



ఒకే ఇంట్లో ఉండే ఇద్దరు పిల్లల్లో ఒకరిని ఒకలా, మరొకరిని ఇంకోలా చూస్తే వారిలో ఆత్మ న్యూనతా భావం పెరుగుతుందని పరిశోధకులు అంటున్నారు. ముఖ్యంగా చిన్నతనంలో పిల్లల మధ్య వారి తెలివితేటల విషయంలో ఉన్న తేడా పట్ల తల్లిదండ్రులు ఎంత సమతూ కంతో వ్యవహరిస్తే అంత మంచిది. ఇలా వారి మధ్య ఉండే తేడాలను పదేపదే ప్రస్తావించి వారిపై మానసిక ఒత్తిడి తెస్తే మాత్రం ఆ భావన ఆ పిల్లల్లో పెరిగి తామెం దుకూ పనికిరామన్న ఆత్మ న్యూనతకు దారి తీస్తాయి. ఈ బీజాలను నాటేది వేరెవరో కాదు...స్వయానా తల్లిదండ్రులే. దాని వల్ల పిల్లలు పెద్దయ్యాక వారి మధ్య ప్రేమానురాగాలు పెంపొందడానికి బదులుగా ఈర్ష్య, అసూయలు వెల్లువెత్తుతాయి. ఇదే ఆత్మన్యూనతా భావంగా స్థిరపడుతుంది. ఈ ఆత్మన్యూనతా భావం అనేది ఒక వ్యక్తి జీవితంలో వారి చిన్నతనంలోనే తల్లిదండ్రులు ఇతర పెద్దల అజాగ్రత్తవల్ల, బాఎధ్యతా రహితమైన వ్యాఖ్యల వల్ల వారి మస్తిష్కంలో నాట బడ తాయి. దాని ప్రభావం మనిషి వ్యక్తిత్వాన్ని దెబ్బతీసిగాని వదలదు. పెద్దలు పిల్లలను తోటి పిల్లలతో పోల్చి మాట్లాడడం లాంటి పొరపాటు చేస్తుంటారు. ఆ మాటలకు ఆ లేత హృదయాలు ఎంతగా గాయ పడతాయో చెప్ప లేము.

ఇక ఆడపిల్లలైతే రూపలావణ్యాలతో అక్కతో, చెల్లితో పోల్చి వారు బాధపడేలా చేస్తారు. రంగులో ఆ పిల్లలను పోల్చి బాల్యం లోనే నల్ల పిల్ల అని ముద్ర వేస్తారు. పొట్టివారైతే పొట్టిపిల్ల అని అంటూ ఆ భావన వారిలో కలిగేలా చేస్తారు. ఇలాంటి మాటల వల్ల ఆ పిల్లల్లో ఆత్మన్యూనతాభావం క్రమంగా పెరిగి బాధను ఎవరికీ చెపలేక తమలో తామే కుంగిపోతుంటారు.

# ఆహారంతో ఆరోగ్యం



ఆహారంలో ప్రొటీన్లు తక్కువగా ఉంటే ఆకలి ఎక్కువగా అవుతుంది. 20 శాతం ప్రొటీన్లు ఉన్న భోజనం చేసే వారితో పోలిస్తే 15 శాతం ప్రొటీన్లు ఉన్న భోజనం తీసుకునే వారు ఒక రోజులో 260 క్యాలరీలు ఎక్కువగా తీసుకుంటారు. 70 శాతం అదనపు క్యాలరీలు మనం రోజూ తినే చిరు తిండ్లతోనే సమకూరుతుంది. సంవత్సరం గడిచే సరికి సుమారు ఐదు నుంచి ఎనిమిది కిలోల బరువు కూడా పెరుగుతాము. దీన్ని నివారించాలంటే మాంసం, చేపలు, కోడిగుడ్ల వంటి ఆహారాన్ని సాధారణంగా తీసుకునే దాని కన్నా ఎక్కువగా తీసుకోవాలి. మనం తీసుకునే ఆహారంలో ప్రొటీన్ల నిష్పత్తి తగ్గితే ఆకలి పెరుగుతుంది. తద్వారా ఇంకా తింటాం. దీంతో శరీరంలో కెలరీలు విపరీతంగా పెరిగిపోయాయి. ఆహారాన్ని స్వీకరించడంలో సమతుల్యత, వైవిధ్యం, మితంగా వ్యవహరించడం అనేవి ఆరోగ్యకరమైన అలవాటు. అలా అని ఒకేసారి తినేదాని కంటే అధికంగా పట్టించినా ఇబ్బందే. ఒక్కసారే ఎక్కువ మొత్తంలో తినేకంటే రోజులో ఎక్కువసార్లు కొద్దికొద్దిగా తినడమే ఆరోగ్యకరమని వైద్యులు చెబుతున్నారు. ఎక్కువ క్యాలరీలు పొందకుండా, ఒకే దానిని అతిగా స్వీకరించకుండా అనేక రకాలు ఆహార పదార్థాలను కొంచెంగా తీసుకోవడం మంచిది. పోషక పదార్థాలు అధికంగా ఉండే వివిధ రకాల ఆహార పదార్థాలను తీసుకోండి. ఈ లెక్కన మంచి ఆరోగ్యం కోసం వైవిధ్యమైన 30 నుంచి 35 రకాల పోషక పదార్థాలను తీసుకోవాల్సి ఉంటుంది. ఏ ఒక్క ఆహారం కూడా అన్నింటినీ అందించదు. మీ దినసరి ఆహార ఎంపికలో పప్పు ధాన్యాలతో చేసిన పదార్థాలు, పండ్లు, కూరగాయలు, పాల పదార్థాలు, మాంసం, చేపలు ఉండేలా చూసుకోవాలి.

దీని కోసం టైం టేబుల్‌ను తయారు చేసుకుని దాన్ని పాటించాలి. రోజు ఎన్ని కెలరీలను ఖర్చు చేయగలమో అంత మోతాదులోనే ఆహారం తీసుకోవాలి. ధాన్యాలు, పండ్లు, పప్పులు, కూరగాయలను అధికంగా తీసుకోండి. పచ్చి కూరగాయలు తీసుకుంటే పోషకాలు నేరుగా అందుతాయి. అన్నంలో, చపాతీల్లో కూర ఎక్కువ తినాలి. రోజు ఎంత తినాలి? అనే విషయంలో మన చేసే పని, ఎత్తు, ప్రస్తుత బరువు, వయస్సు, స్త్రీ, పురుషుడు ఇలా పలు లక్షణాలను అంచనా వేయాల్సి ఉంటుంది.

అధిక బరువు శరీరానికి చేటు చేస్తుంది. ఎత్తుకు సరిపోయేలా బరువు వుంటే చాలు. ఈ విషయంలో వైద్యుడిని సంప్రదించి సలహా తీసుకోండి. మితాహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని రక్షించుకోవచ్చు. ఆహారాన్ని తీసుకోవడంలోనూ సమయపాలన తప్పనిసరి.

# మహిమాన్వితం.. శివగంగ ఆలయం



పద్మాకారంలో ఆలయం. కింద గం గమ్మ.. మధ్యన రాజరాజేశ్వరి మాత..ఆ పైన త్రినేత్రుడు కొలువుదీరిన మహాదుతేమైన చోటు. చుట్టూ పద్మరేకుల్లా చిన్నచిన్న శివాలయాలు.., రావి, వేప, మేడి చెట్లు అల్లుకొని త్రివ ృక్షమై బాసిల్లుతున్న ప్రాంతం..అదే మహేశ్వరంలోని శివగంగ రాజరాజేశ్వరస్వామి ఆలయం. కాకతీయుల కాలంలో నిర్మాణమైన ఈ ఆల యం దినదినాభివ ృద్ధి చెందుతూ..భక్తుల కొంగుబంగారమై అలలారుతోంది. ఈకోవెల 6తేదీ నుంచి శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతోంది. - మహేశ్వరం

కాకతీయుల కాలంలో రాజరాజేశ్వరస్వామి ఆలయం నెలకొల్పడంతో ఈ గ్రామానికి మహేశ్వరం అని పేరు వచ్చింది. శివగంగలో కొలువుదీరిన ఈ ఆలయం సందర్శకులను ఇట్టె కట్టిపడేస్తుంది. ఈ ఆలయ నిర్మాణం పద్మాకారంలో ఉంటుంది. దీనిచుట్టూ శ్రీహరిహరేశ్వరుడు, శ్రీమల్లీశ్వరుడు, శ్రీఅవిముక్తేశ్వరుడు, శ్రీఅఘోరేశ్వరుడు, శ్రీఅమరేశ్వరుడు, శ్రీఅమ ృతేశ్వరుడు, శ్రీగంగాధేశ్వరుడు, శ్రీఇష్టకామేశ్వరుడు, శ్రీముకేశ్వరుడు, శ్రీకాళహస్తీశ్వరుడు, శ్రీఏకాంబేశ్వరుడు, శ్రీమణికరి?కేశ్వరుడు, శ్రీమహానందీశ్వరుడు, శ్రీఅమరావతీశ్వరుడు, శ్రీకాశీపతీశ్వరుడు, శ్రీమంగళగౌరీశ్వరుడు ఆలయాలు పదరేకుల్లా ఉంటాయి.

ఆలయంలోని అష్టాదశంగా (18 సంఖ్య వచ్చేలా) నిర్మించడం విశేషం. సహాజంగా శివుడి తలపై గంగ ఉంటుంది. ఇక్కడ మాత్రం గంగలోనే శివుడు ఉండడంతో ఆయన కింది భాగంలోనే రాజేశ్వరీ దేవి విగ్రహాన్ని ప్రతిషిʻంచారు. ఈ శివగంగలో స్నానమాచరిస్తే వారి దోషాలు పోతాయని భక్తుల నమ్మకం.

**చరిత్రకు నిలువుటద్దం గడికోట**

కాకతీయుల కాలం నాటి చరిత్రకు నిలువుటద్దంగా ఆలయం పక్కనే గడికోట నిర్మాణం నేటికీ నిలిచి ఉంది. కొంత శిథిలావస్థకు చేరినప్పటికీ కోటలోని కట్టడాలు నేటికి సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. గడికోట చుట్టూ ఆర్చ్‌లతో పాటు మధ్యలో ఉన్న కొలనును అదుతేంగా నిర్మించారు.

**మహత్యం..త్రివ ృక్షం...:**

ఆలయం ముందున్న చెట్టుకు ఓ చరిత్ర ఉంది. రావి, వేప, మేడి చెట్లు ఒకేచోట పెరగడంతో దీన్ని తివ ృక్ష చెట్టుగా పిలుస్తారు. పిల్లలు కానివారు ఈ చెట్లకు కొత్త కొబ్బరికాయ కట్టితే పిల్లలు పుడుతారని నమ్మకం. ఈవ ృక్షం కిందనే నాగేంద్రాలయం ఉంది.

**శివగంగకు దారి ఇలా..:**

ఆలయం హైదరాబాద్ నుంచి 25 కిలో మీటర్ల దూరంలో ఉంటుంది. ఫలక్‌నుమా, మిధాని, షాద్‌నగర్, ఇబ్రహీంపట్నం, రాజేంద్రనగర్ డిపోల నుంచి బస్సు సౌకర్యం ఉంది. జూబ్లీబస్ స్టేషన్ నుంచి మహేశ్వరానికి 253/ 90కె, చార్మినార్ నుంచి 253 ఎం, 253 కె, 253 టి, 253 హెచ్, సికింద్రాబాద్ నుంచి 8ఎ/ 253ఎం. జూబ్లీహిల్స్ నుంచి 253 ఎం, బస్సులు ఎక్కాలి. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, కొండాపూర్ ప్రాంతాల నుంచి వచ్చే వారు ఔటర్‌రింగ్ రోడ్డు మీది నుంచి తుక్కుగూడ వరకు వచ్చి శ్రీశైలం రహదారి మీదుగా మహేశ్వరం గేట్ కమాన్ నుంచి ఆలయానికి చేరుకోవచ్చు.

**ఆలయ చరిత్ర...**

తానీషా నవాబుల వద్ద పని చేసిన అక్కన్న మాదన్నలు 1672లో వారి పర్యటనలో భాగంగా శిథిలావస్థలో ఉన్న ఈ ఆలయాన్ని పునరుద్ధరించారు. అప్పటి రాజధాని గోల్కొండ కోటకు పశ్చిమ భాగాన 37 కిలో మీటర్ల దూరంలో ఈ దేవాలయం ఉంది. శంషాబాద్ మండలంలోని చిన గోల్కొండ, పెద్ద గోల్కొండ గ్రామాల మీదుగా అక్కన్న ,మాదన్నలు ఇక్కడికి చేరుకునేవారట.

మహేశ్వరం ఆలయంతో పాటు సమీపంలోనే కోదండరామస్వామి ఆలయం, శివగంగ పుష్కరిణి, విషు? భగవాన్, ఆంజనేయస్వామి ఆలయాలను సైతం అక్కన్న మాదన్నలు నిర్మించినట్లు ప్రతీతి . ఎనిమిదేళ్ల కాలంలో వీటి నిర్మాణం పూర్తయినట్లు చరిత్ర చెబుతోంది. 1677లో ఈ ఆలయం పునర్‌నిర్మాణంలో ఉన్నప్పుడు శ్రీశైలం దర్శనానికి వెళ్లిన శివాజీ కూడా రాజరాజేశ్వరస్వామిని దర్శించుకొని వెళ్లినట్లు చరిత్ర చెబుతుంది. 1687లో ఔరంగజేబు దాడిలో గుడిని ధ్వంసమైనట్లు చెబుతుంటారు.



# విశాఖలో జన'సేనాని'కి హారతి

- శనివారం పెందుర్తి నియోజక వర్గం వెళ్లిన ప్రవన్ కళ్యాణ్
- బీచ్ రోడ్డు నుంచి సుజాత నగర్ వరకు అడుగడుగునా జనసేన శ్రేణుల స్వాగతం
సమస్యలు చెప్పుకొన్న సామాన్య జనం - సమస్యలు వింటూ సాగిన పవన్ కళ్యాణ్
- ప్రతి సమస్యపై గళం విప్పుతానని హామీ



విశాఖపట్నం **(విజయభాను న్యూస్)** : వారాహి విజయ యాత్రలో భాగంగా విశాఖలో పర్యటిస్తున్న జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ కి అడుగు అడుగన ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. పోలీసులు ఆంక్షలు అమలు చేస్తున్నపట్టికీ పవన్ కళ్యాణ్ బయటికి వస్తున్నారంటే ఆ ఆంక్షల కంచెలు దాటుకుని వేలాదిగా రోడ్ల మీదకు వస్తున్నారు. శనివారం పెందుర్తి నియోజకవర్గం, సుజాత నగర్ లో వాలంటీర్ చేతిలో హత్యకు గురైన వృద్ధురాలు కోటగిరి వరలక్ష్మి కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లిన జనసేనానికి జనం ప్రతి అడుగులో ఘన స్వాగతం పలికారు. బీచ్ రోడ్డు నుంచి పోలీసులు తీవ్ర ఆంక్షలు అమలు చేసినప్పటికీ పెద్ద ఎత్తున రోడ్ల మీదకు వచ్చారు. కైలాసగిరి, సింహాచలం, వేపగుంట, సుజాత నగర్ ప్రాంతాల్లో జనసేన శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున రోడ్ల మీదకు వచ్చి పవన్ కళ్యాణ్ కి జేజేలు పలికారు. హాల్లో ఏపీ.. బైబై వైసీపీ నినాదాలతో హోరెత్తించారు. సింహాచలం - అడవివరం వద్ద ఆడపడుచులు పవన్ కళ్యాణ్ కోసం ఆప్యాయంగా జామ పండ్లు తీసుకురాగా వాటిని స్వీకరించారు. తనకోసం పండ్లు తెచ్చిన ఆడపడు చులను ఆప్యాయంగా పలుకరించారు.

సుజాతా నగర్ ప్రధాన రహదారి నుంచి వరలక్ష్మి ఇంటి వరకు అపార్ట్ మెంట్ల వాసులంతా పవన్ కళ్యాణ్ రాక సందర్భంగా రోడ్ల మీదకు వచ్చేశారు. పవన్ కళ్యాణ్ ని తమ సెల్ ఫోన్లలో ఫోటోలు, వీడియోల్లో బంధించేందుకు పోటీ పడ్డారు. ప్రతి ఒక్కరికీ అభివాదం చేస్తూ పవన్ కళ్యాణ్ ముందుకు సాగారు.

సుజాతనగర్ కు పవన్ కళ్యాణ్ వస్తున్న విషయం తెలుసు కున్న విశాఖ వాసులు ఆయనకు తమ సమస్యలు చెప్పుకు నేందుకు ముందుకు వచ్చారు. ప్ల కార్డుల ద్వారా సమస్యలు ఆయన దృష్టికి తీసుకువెళ్లే ప్రయత్నం చేశారు.

సింహాచలం వద్ద సింహాచలం పంచ గ్రామాల సమస్య పరిష్కరించాలంటూ బాధిత ప్రజలు ప్లకార్డులతో పవన్ కళ్యాణ్ వాహన శ్రేణి వద్దకు వచ్చారు. తమ సమస్యపై వినతిపత్రం అంద చేశారు. పంచ గ్రామాల సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని పవన్ వారికి హామీ ఇచ్చారు. వేపగుంట వద్ద ఎల్జీ పాలిమర్స్ గ్యాస్ లీక్ బాధితులు తమకు న్యాయం చేయాలంటూ పవన్ కళ్యాణ్ ను కలిశారు. గ్యాస్ లీక్ బాధితులకు పరిహారం ఇవ్వలేదని, మా గ్రామ యువతపై పెడుతున్న అక్రమ కేసులు ఎత్తివేసే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని బ్యానర్లు ప్రదర్శించారు. కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పవన్ కళ్యాణ్ ని కోరారు. గ్రీన్ టాక్స్ పేరిట జరుగుతున్న దోపిడిని అప్పలరాజు అనే ట్రక్కు డ్రైవర్ పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువచ్చారు. గ్రీన్ టాక్స్ వసూళ్లపై మాట్లాడుతానని పవన్ కళ్యాణ్ బాధిత ట్రక్కు డ్రైవర్లకు భరోసా ఇచ్చారు.

సుజాతనగర్ నుంచి తిరుగు ప్రయాణంలోనూ జనం పెద్ద ఎత్తున రోడ్ల మీదే ఉన్నారు. పెందుర్తి వెళ్లేప్పటికంటే తిరుగు ప్రయాణంలో రెట్టింపు ప్రజలు రోడ్ల మీదకు వచ్చారు. పవన్ కళ్యాణ్ పర్యటన ఆద్యంతం జన సంద్రం మధ్య సాగింది.



## కేజీహెచ్ లో అభివృద్ధి పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ మల్లికార్జున







విశాఖపట్నం **(విజయభాను న్యూస్)** : కేజీహెచ్ లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ మల్లికార్జున శనివారం ఉదయం పరిశీలించారు. కేజీహెచ్ లో అత్యవసర చికిత్స విభాగంలో ఆధునీకరణ పనులను, క్లినికల్ ల్యాబ్ ను మరియు ప్రధాన ద్వారం వద్ద నిర్మిస్తున్న ఆర్చ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ అత్యవసర చికిత్స విభాగం విస్తరణ పనులను రూ. 30 లక్షలతో చేపడుతున్నట్లు తెలిపారు. అదే విధంగా 24 గంటలు అందుబాటులో ఉండే విధంగా అత్యవసర క్లినికల్ ల్యాబ్ రూ.15 లక్షలతో ఏర్పాటు చేస్తున్నట్లుగా తెలిపారు . ఈ కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ పి.శివానంద, వివిధ విభాగాల అధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఈఫిల్ టవర్‌కు బాంబు బెదిరింపు.. పరిసర ప్రాంతాల్లో హై అలర్ట్



పారిస్: ఫ్రాన్స్‌లోని ప్రపంచ ప్రఖ్యాత ఈఫిల్ టవర్‌ను కూల్చివేసేందుకు బాంబు అమర్చామంటూ కొందరు దుండగులు ఫోన్ చేసి బెదిరించారు. దీంతో అప్రమత్తమైన భద్రతా సిబ్బంది.. ఆ పరిసర ప్రాంతాలను తమ అధీనంలోకి తీసుకున్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా సందర్శకులందర్నీ అక్కడి నుంచి బయటకి పంపేశారు. పోలీసులు సహా బాంబు నిర్వీర్య బృందాలు గాలింపు చర్యలు చేపడుతున్నట్లు అక్కడి మీడియా వెల్లడించింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ అద్భుత నిర్మాణాన్ని చూసేందుకు ప్రతి ఏటా దేశ విదేశాల నుంచి లక్షలాది మంది పర్యాటకులు వస్తుంటారు. గతేడాది 62 లక్షల మంది ఈ కట్టడాన్ని సందర్శించినట్లు రికార్డులు చెబుతున్నాయి.

## జనరిక్ మందులనే రాయాలి.. లేదంటే లైసెన్స్ సస్పెండే..

దిల్లీ: వైద్యులు తమ వద్దకు వచ్చే రోగులకు చౌకగా లభించే జనరిక్ ఔషధాల నే రాయాలని కేంద్రం ఆదేశించింది. లేదంటే డాక్టర్ల పై చర్యలు తప్పవని హెచ్చరించింది. అవసరమైతే వారి లైసెన్సును కూడా సస్పెండ్ చేయాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఈ మేరకు నేషనల్ మెడికల్ కమిషన్ రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టిషనర్స్‌పేరుతో జారీ చేసిన కొత్త నిబంధనల్లో పేర్కొన్నారు. కాగా, 2002లో భారత వైద్య మండలి జారీ చేసిన నిబంధనల ప్రకారం దేశంలోని ప్రతి వైద్యుడు జనరిక్ మందుల నే ప్రిస్క్రైబ్ చేయాలనే సూచనలు ఉన్నప్పటికీ.. దీనికి భిన్నంగా వ్యవహరించే వైద్యులపై ఎలాంటి చర్యలను అందులో పేర్కొనలేదు. తాజాగా ఆ నిబంధనల స్థానంలో ఎన్ఎంసీఆర్ఎంపీ నియమావళి-2023 అమల్లోకి తెచ్చినట్లు జాతీయ వైద్య కమిషన్ వెల్లడించింది. ఇందులో నిబంధనలను పాటించని వైద్యులపై చర్యలను కూడా పేర్కొన్నారు. దీని ప్రకారం.. "ప్రతి రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టిషనర్ తమ వద్దకు వచ్చే రోగులకు జనరిక్ పేర్లతో ఔషధాలను రాయాలి. అనవసర మందులు, అహేతుకమైన ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్ ట్యాబ్లెట్లను సూచించకూడదు" అని నిబంధనల్లో పేర్కొన్నారు. ఈ నిబంధనలను ఎవరైనా ఉల్లంఘిస్తే.. సదరు వైద్యులను హెచ్చరించడంతో పాటు వర్క్‌షాపులకు హాజరయ్యేలా ఆదేశాలు జారీ చేస్తారు. ఒకవేళ పదే పదే నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడితే.. ఆ వైద్యుడి లైసెన్సును కొంతకాలం పాటు నిలిపివేయనున్నట్లు నిబంధనల్లో వెల్లడించారు.

## గీతం వర్శిటీ ఫిజియోథెరపీ డైరక్టర్ కు జాతీయ అవార్డు



సాగర్‌నగర్ **(విజయభాను న్యూస్)** : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఫిజియోథెరపీ డైరక్టర్ డాక్టర్ మాధురీ కాశీ ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజియోథెరపిస్ట్స్ మహిళా విభాగం నుంచి జాతీయ స్థాయి లో స్ఫూర్తిదాయకురాలైన నాయకురాలిగా అవార్డు అందుకున్నారు. న్యూఢిల్లీలో ఇటీవల జరిగిన ఫిజియోథెరపీ ప్రథమ జాతీయ సమావేశాలలో వరల్డ్ ఫిజియో థెరపీ అధ్యక్షుడు డాక్టర్ మైక్ ల్యాండ్రీ చేతుల మీదుగా ఈ అవార్డును డాక్టర్ మాధురీ అందుకున్నారు. ఈ సమావేశాలలో ఫిజియోథెరపీ భవిష్యత్తు, నూతన పద్ధతులు, వృత్తినైపుణ్యాలపై జరిగిన చర్చలలో సహితం పాల్గొన్నారు. బ్యాచులర్ ఆఫ్ ఫిజియోథెరపీ ప్రథమ సంవత్సరం విద్యార్థులతో కలిసి సమావేశాలకు హాజరవడంతో పాటు పలు శాస్త్రీయ చర్చలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు.

## ఓటర్ల జాబితా ఇంటింటి సర్వే ప్రక్రియ త్వరతగతిన పూర్తి చేయాలి



విశాఖపట్నం, **(విజయభాను న్యూస్)** ఓటర్ల జాబితా ఇంటింటి సర్వే ప్రక్రియ త్వరతగతిన పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ కె.యస్.విశ్వనాధన్ అధికారులకు, సిబ్బంది కి సూచించారు. శనివారం ఉదయం భీమిలి మరియు విశాఖ తూర్పు శాసన సభా నియోజక వర్గాల పరిదిలో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే కార్యాక్రమంలో జాయింట్ కలెక్టరు పాల్గోన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ బార్యా,భర్తలు వివిధ పోలింగ్ స్టేషన్లో ఓటరుగా నమోదయి ఉన్నా లేదా ఓటర్ల జాబితాలో చేర్చకపోయినా, 18 సంవత్సరాలు నిండి ఓటరుగా నమోదు కాకపోయిన బియల్‌ఓ వారి ఇంటిని సందర్శించినప్పుడు క్షుణ్ణంగా తనిఖీ చేసుకొని, ఏమైన సవరణ ఉన్నచో అటువంటి వారికి బియల్‌ఓ తగు ఫారం ఇచ్చి ఓటరు జాబితాను సరి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో భీమిలి ఆర్డీఓ బాస్కర్ రెడ్డి, స్టీల్ ప్లాంట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు, భీమిలి మరియు విశాఖ రూరల్ తహశిల్దార్లు, బియల్‌ఓ లు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల్ని ప్రతీసారి మోసం చేయలేరు.. మోదీపై మమత ఫైర్..!

కోల్‌కతా: పశ్చిమబెంగాల్ పంచాయతీ ఎన్నికల్లో టీఎంసీ బెదిరింపులు, బూత్ ఆక్రమణలను పాల్గడిందంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలపై టీఎంసీ అధినేత్రి, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ శనివారంనాడు నిప్పులు చెరిగారు. సాక్ష్యాలు లేకుండా మాట్లాడటం తగదన్నారు. అవినీతికి సంబంధించి అనేక అంశాలు మిమ్మల్ని చుట్టుముట్టి ఉన్నందున ఎలా అవినీతి అంశాన్ని మీరు లేవనెత్తుతారని ప్రశ్నించారు. "మీరు ప్రజలను కొన్నిసార్లు మోసం చేయగలరు. కానీ, ప్రతీసారి మోసం చేయలేరు" అని ఎదురుదాడికి దిగారు. "ఆయన (మోదీ) ఎలాంటి సాక్ష్యాలు లేకుండా మాట్లాడుతున్నారు. సామాన్య ప్రజలు బాధపడటమే ఆయనకు కావాలి. పీఎం కేర్స్ ఫండ్, రాఫెల్ డీల్, పెద్ద నోట్ల రద్దు వంటి అంశాలు మిమ్మల్ని చుట్టుముట్టి ఉన్నాయి. మీరు అవినీతి ప్రస్తావన చేయడం ఏమిటి? మీరు ప్రజలను కొన్నిసార్లు మాత్రమే మోసం చేయగలరు. ప్రతీసారి మోసం చేయలేరు. మహిళలు, మహిళా రెజ్లర్లు, మణిపూర్‌లో మహిళలపై అకృత్యాలు జరుగుతున్నా, మీ సొంత మనుషులపై కేసులు నమోదవుతున్నా వారిపై మీరు ఎప్పుడూ చర్యలు తీసుకున్న పాపాన పోలేదు. మణిపూర్‌లో 16-17 మందికి పైగా మహిళలు బలయ్యారు" అని మమతా బెనర్జీ అన్నారు.

దీనికి ముందు, కోల్‌కతాలో శనివారం జరిగిన జీ20 యాంటీ కరప్షన్ సమావేశంలో మోదీ వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా మాట్లాడుతూ, భారత దేశం ఎట్టి పరిస్థితుల్లోనూ అవినీతిని సహించబోదని అన్నారు. గరిష్ఠ స్థాయి ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వ నిధులను పెంచడం ప్రభుత్వ కర్తవ్యమని చెప్పారు. సత్యం, చిత్తశుద్ధిలను దురాశ క్రమంగా క్షీణింపజేస్తుందని, ప్రతి ఒక్కరూ ఈ విషయం పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. మరింత పారదర్శకత, జవాబుదారీతనంతో కూడిన వ్యవస్థను సృష్టించేందుకు టెక్నాలజీ, ఈ-గవర్నెన్స్ వ్యవస్థలను వృద్ధి చేస్తున్నమన్నారు.

పశ్చిమ బెంగాల్‌లోని బీజేపీ క్షేత్రీయ పంచాయతీ రాజ్ పరిషత్ సమావేశాన్ని ఉద్దేశించి ప్రధాని మాట్లాడుతూ, పశ్చిమ బెంగాల్ పంచాయతీ ఎన్నికల్లో హింసాత్మక సంఘటనలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను ముఖ్యమంత్రి మమత బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ బెదిరించిందని, పోలింగ్ బూత్‌లను ఆక్రమించిందన్నారు. బీజేపీ అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయకుండా అన్ని రకాలుగా టీఎంసీ అడ్డుకుందని మండిపడ్డారు. బీజేపీ కార్యకర్తలను మాత్రమే కాకుండా, ప్రజలను కూడా టీఎంసీ నేతలు, కార్యకర్తలు బెదిరించారన్నారు. పోలింగ్ బూత్‌ల ఆక్రమణ కోసం గూండాలకు కాంట్రాక్టు ఇచ్చారని దుయ్యబట్టారు. టీఎంసీ రాష్ట్రంలో రాజకీయాలు చేసే తీరు ఇదేనన్నారు. ప్రతిపక్షాలను బెదిరించడానికి హింసను ఆయుధంగా వాడుకున్నారన్నారు. ఇన్ని రకాల బెదిరింపులు ఉన్నప్పటికీ, పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన బీజేపీ నేతలను అభినందించారు.

## అథ్లెటిక్స్ క్రీడాకారులను ప్రోత్సహించాలి

- అంతర్జాతీయ అథ్లెటిక్స్ క్రీడాకారిణి జ్యోతి యర్రజి కి లక్ష రూ. విరాళం అందజేత.
- రాష్ట్ర జనరల్ బాడీ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు కే వెంకటేశ్వరరావు



మద్దిలపాలెం (విజయభాను న్యూస్) : అథ్లెటిక్స్ అంతర్జాతీయ మీట్ లో దూసుకుపోతున్న విశాఖ కు చెందిన జ్యోతి యర్రజి కి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అథ్లెటిక్స్ రాష్ట్ర అధ్యక్షులు కే వెంకటేశ్వరరావు చేతుల మీదగా ఆమె తల్లిదండ్రులకు లక్ష రూపాయలు చెక్కును ప్రోత్సాహంగా అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు వారిని ఘనంగా సత్కరించారు. రాష్ట్ర వార్షిక జనరల్ బాడీ సమావేశం శనివారం విశాఖపట్నం ఇసుకతోట మై రెస్టారెంట్ మీటింగ్ హాల్లో రాష్ట్ర అధ్యక్షులు కే వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్త%శీ%గా అథ్లెటిక్స్ క్రీడాకారులను తయారు చేసుకునే బాధ్యత మనందరిపై ఉందని, ఆ దిశగా అందరూ కృషి చేయాలని కోరారు. 2019 లో జాతీయ అథ్లెటిక్స్ పోటీలు గుంటూరు లో నిర్వహించామని, అన్ని జిల్లాల్లో అథ్లెటిక్స్ క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసుకోవాలని, జూనియర్ మీట్, సౌత్ జోన్ మేట్ వంటి క్రీడలు అన్ని జిల్లాల్లో ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. జ్యోతి ఏర్రాజి తల్లిదండ్రుల ప్రోత్సాహం కారణంగానే అంతర్జాతీయ క్రీడాకారిణిగా ఎదిగిందని కొనియాడారు. తండ్రి ఓ సాధారణ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తూ తన కూతురు కు ప్రోత్సాహం ఎంతో అందించారన్నారు. ప్రతి జిల్లాలో టోర్నమెంట్లు నిర్వహించాలని కోరారు. జిల్లాలో ఉన్న నాయకత్వం ఐకమత్యంతో పనిచేసి ఎంతోమంది విద్యార్థులను అథ్లెటిక్స్ క్రీడాకారులకు తీర్చిదిద్దాలని కోరారు. రానున్న సెప్టెంబర్ లో అథ్లెటిక్స్ రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక జరుగుతుందని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ రాష్ట్ర జనరల్ బాడీ సమావేశానికి అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల హైమ , జాయింట్ సెక్రటరీలు ఎన్ విజయకుమార్, హర్షవర్ధన్, రంగారావు, తోపాటు వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, విశాఖ జిల్లా అథ్లెటిక్స్ అధ్యక్ష, కార్యదర్శులు డి. నాగేశ్వరరావు, ఎం నారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.

## రానున్న రెండురోజుల్లో ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలు : రెడ్ అలర్ట్ ప్రకటించిన ఐఎండి

న్యూఢిల్లీ : రానున్న రెండురోజుల్లో ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలు కురిసే అవకాశమున్నందున భారత వాతావరణ శాఖ శనివారం ఆ రాష్ట్రానికి రెడ్ అలర్ట్ ప్రకటించింది. 'ఆగస్టు 13-14 తేదీల్లో ఉత్తరాఖండ్‌లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశముంది. 204.4మి.మీ కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది.' అని ఐఎండి తన ట్వీట్‌లో పేర్కొంది. ఈ కారణంగా ఉత్తరాఖండ్ రాష్ట్రానికి ఐఎండి రెడ్ అలర్ట్‌ను జారీ చేసినట్లు ఐఎండి ట్వీట్ చేసింది. ఈ రెండు రోజుల్లో ఆ రాష్ట్ర ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఐఎండి సూచించింది. కాగా, ఉత్తరాఖండ్‌లో గత రెండు రోజులుగా పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS .,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com